# వేకువ సమయం

సంపుటి: 14 సంచిక: 126

VEKUVA SAMAYAM TELUGU DAILY

★ Mahabubnagar ★ Hyderabad ★ Miryalaguda & Rangareddy | సంపాదకులు : కె.భాస్కర్‌రావు | రూ.2.00/- పేజీలు 8 | తేది: బుధవారం 27 మే 2026




2వ పేజీలో...



2వ పేజీలో...



2వ పేజీలో...

# ఆఫ్రికా నుంచి వచ్చే ప్రయాణికులపై ప్రత్యేక నిఘా: దామోదర రాజనర్సింహ



**హైదరాబాద్, (సమయం ప్రతినిధి):** ఎబోలా వైరస్‌పై తెలంగాణ ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎబోలా కేసులు లేవన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడా ఎబోలా లక్షణాలు ఉన్న వారిని గుర్తించలేదని పేర్కొన్నారు. ఎబోలాపై రాష్ట్ర ప్రభుత్వం హై అలర్ట్ ప్రకటించిందని తెలిపారు. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో కట్టుదిట్టమైన స్క్రీనింగ్ టెస్ట్‌లు నిర్వహిస్తున్నామని వివరించారు. ఆఫ్రికా దేశాల నుంచి వచ్చే ప్రయాణికులపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. డీఆర్సీ, ఉగాండా, దక్షిణ సూడాన్ నుంచి వచ్చే ప్రయాణికులకు థర్మల్ స్కానింగ్ చేస్తున్నామన్నారు. ఎయిర్‌పోర్ట్‌లో ప్రత్యేక వైద్య బృందాల ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గాంధీ ఆస్పత్రిలో 10 పడకల ఐసోలేషన్ వార్డు ఇప్పటికే సిద్ధంగా ఉంచామన్నారు. డాక్టర్ సునీల్ కుమార్ నోడల్ అధికారిగా నియామించినట్లు చెప్పారు. అనుమానితుల సాంపుల్స్‌ను మహారాష్ట్ర పుణేలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ (NIV)కి పంపామన్నారు. విదేశాల నుంచి 58 మంది ప్రయాణికులు హైదరాబాద్‌కు చేరుకున్నారన్నారు. వారిలో ఎవరికీ ఎబోలా లక్షణాలు లేవని తెలిపారు. 58 మందిని 21 రోజుల పాటు హోమ్ ఐసోలేషన్‌లో అధికారులు ఉంచారని గుర్తు చేశారు. 108 అంబులెన్స్‌లను 24 గంటలు సిద్ధంగా ఉంచామని చెప్పారు. అన్ని ప్రభుత్వాసుపత్రులు అప్రమత్తంగా ఉండాలని వైద్యులకు సూచించారు.

ఇన్‌ఫెక్షన్ కంట్రోల్ ప్రోటోకాల్స్ కచ్చితంగా అమలు చేయాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని అధికారులను ఈ సందర్భంగా మంత్రి హెచ్చరించారు. ప్రజారోగ్య రక్షణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడించారు.




**కరీంనగర్, (సమయం ప్రతినిధి):** ధాన్యం కొనుగోళ్ల విషయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్ర విమర్శలు చేశారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించిన నిధులు కేంద్ర ప్రభుత్వానివా, రాష్ట్ర ప్రభుత్వానివా అన్న విషయంపై సమాధానం చెప్పాలన్నారు. ధాన్యం రవాణా ఖర్చులను కూడా పూర్తిగా కేంద్ర ప్రభుత్వమే భరిస్తోందని బండి సంజయ్ పేర్కొన్నారు. ఈ ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వం కేవలం మధ్యవర్తిగా మాత్రమే వ్యవహరిస్తోందన్నారు. అయినప్పటికీ ధాన్యం కొనుగోళ్లలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రైతులు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం ఇకనైనా బేషజాలకు పోకుండా యుద్ధ ప్రాతిపదికన ధాన్యం కొనుగోళ్లను పూర్తి చేయాలని కోరారు. అలాగే అన్ని రకాల వడ్లకు బోనస్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావడమే లక్ష్యంగా 'రైతు గోస – బీజేపీ భరోసా' పేరుతో యాత్రలు నిర్వహిస్తున్నామని బండి సంజయ్ తెలిపారు. రైతుల సమస్యల పరిష్కారానికి బీజేపీ కట్టుబడి ఉందని పేర్కొన్నారు.







# సంపాదకీయం

## ఆదివాసీలను గౌరవించే సంక్షేమం కావాలి!

ఇటీవల ఒడిశాలో వెలుగుచూసిన ఒక దిగ్భ్రాంతికర సంఘటన దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీసింది. జితు ముండా అనే వృద్ధ ఆదివాసీ మరణించిన తన సోదరి ఖాతాలోని కొద్దిపాటి డబ్బు కోసం చివరకు ఆమె అస్థిపంజరాన్ని బ్యాంకు దాకా తీసుకురావాల్సి వచ్చింది. పైకి ఇది సాధారణ బ్యాంకింగ్ సమస్యలా కనిపించినా, వాస్తవానికి ఇది చాలా పెద్ద సంక్షోభానికి సంకేతం. నెలల తరబడి మరణ ధ్రువీకరణ పత్రం రాకపోవడం; ఆధార్ లేకపోవడం వల్ల రేషన్ లభించకపోవడం, వృద్ధాప్య పింఛన్ రాకపోవడం; అడుగడుగునా తమ పేదరికాన్ని, అర్హతను నిరూపించుకోవాల్సిన ఒత్తిడి – ఇవన్నీ కలిసి ఆయన కనీస మానవ గౌరవాన్ని పక్కనపెట్టి వ్యవస్థ ముందుకు రావాల్సిన దయనీయ పరిస్థితిని సృష్టించాయి. ఈ సంక్షోభానికి పరిష్కారం ఆదివాసీలకు హక్కుల ఆధారిత, సార్వత్రిక (యూనివర్సల్) సామాజిక రక్షణను హామీ ఇవ్వడంలోనే ఉంది. సామాజిక సంక్షేమ పథకాల అమలులో రెండు ప్రధానమైన విధానాలు: 'లక్షిత విధానం' 'సార్వత్రిక విధానం' ఉదాహరణకు వృద్ధాప్య పింఛన్లనే తీసుకుంటే–'లక్షిత విధానం'లో 60 ఏళ్లు దాటిన వారిని గుర్తించాక, ప్రభుత్వ డేటాబేస్‌ల ద్వారా వారి ఆర్థిక స్థితిని అంచనా వేస్తారు. ఆదాయపు పన్ను, ఎక్కువ భూమి, నాలుగు చక్రాల వాహనాలు వంటి సంపద సూచికలు లేనివారిని మాత్రమే అర్హులుగా ఎంపిక చేస్తారు. దీనికి భిన్నమైనది 'సార్వత్రిక విధానం'. ఇందులో ప్రభుత్వం 60 ఏళ్లు దాటిన ప్రతి పౌరుడికి బేషరతుగా పింఛన్ అందిస్తుంది. పౌరులందరినీ సామాజిక భద్రతా పరిధిలోకి తీసుకురావడమే దీని ప్రధాన లక్ష్యం. ప్రస్తుతం చాలా పథకాలు 'పేదరిక ఆధారిత లక్షిత విధానం' పైనే ఆధారపడి నడుస్తున్నాయి. ప్రభుత్వాలు దీనిని 'పరిపాలనా సామర్థ్యం' పేరుతో సమర్థిస్తుంటాయి. నిధుల లీకేజీలు తగ్గించి, ప్రభుత్వ సహాయాన్ని అర్హులుగా గుర్తించిన వర్గాలకే పరిమితం చేయాలనేది వారి వాదన. ప్రపంచ బ్యాంక్ వంటి సంస్థలు కూడా ఈ విధానాలను ప్రోత్సహిస్తున్నాయి. ప్రభుత్వ సహాయం 'అర్హులకే' పరిమితం కావాలని భావించే సమాజంలోని ప్రభావశీల వర్గాలు కూడా ఈ లక్షిత విధానాలకే మద్దతు ఇస్తున్నాయి. సిద్ధాంతపరంగా చూస్తే ఈ 'టార్గెటింగ్' విధానం సరైనదిగానే అనిపించవచ్చు. కానీ ఆచరణలో అది చాలా సంక్లిష్టమైన, భారీ పరిపాలనా యంత్రాంగంగా మారుతోంది. ఎందుకంటే 'నిజమైన పేదలు' ఎవరో గుర్తించడానికి ప్రభుత్వాలు ఇప్పుడు విస్తృతమైన డేటాబేస్‌లు, ఆధార్ అనుసంధానం, బ్యాంక్ లింకింగ్, భూమి రికార్డులు, మొబైల్ నంబర్లు, డిజిటల్ ధ్రువీకరణ వంటి వ్యవస్థలపై ఆధారపడుతున్నాయి. ఫలితంగా సంక్షేమ వ్యవస్థలు ప్రజలకు సహాయం చేసేవిగా కాకుండా, డిజిటల్ ధ్రువీకరణ, అర్హత తనిఖీలపై అధికంగా ఆధారపడే యంత్రాంగాలుగా మారిపోతున్నాయి. ప్రభుత్వాలు టార్గెటింగ్‌ను డబ్బు ఆదా చేసే విధానంగా చూపిస్తుంటాయి. కానీ ఈ భారీ డిజిటల్ డేటాబేస్‌ల నిర్మాణం, నిర్వహణ, ధ్రువీకరణ వ్యవస్థలు, సాఫ్ట్‌వేర్ మౌలిక వసతులపై ప్రజాధనం ఎంత ఖర్చవుతోందో చాలా అరుదుగా చర్చకు వస్తుంది. అంతకంటే ముఖ్యంగా, ఈ క్రమంలో ప్రజలు భరిస్తున్న ఖర్చులు పూర్తిగా కనిపించకుండా పోతున్నాయి. ఆధార్ కేంద్రాలకు ప్రయాణాలు, కోల్పోయే కూలి, ఆహార ఖర్చులు, మధ్యవర్తులకు చెల్లింపులు – – ఇవన్నీ పేద కుటుంబాల భుజాలపై అదనపు భారంగా మారుతున్నాయి. దీనికి భిన్నంగా, 'యూనివర్సల్' విధానం చాలా సరళమైనది. ఇందులో వ్యవస్థ ప్రధాన లక్ష్యం ప్రజలను వడపోసి తొలగించడం కాదు; అందరినీ రక్షణ పరిధిలోకి తీసుకురావడం. ముఖ్యంగా చారిత్రకంగా వెనుకబడిన సమాజాల విషయంలో, ఈ సార్వత్రిక విధానం మరింత న్యాయసమ్మతమైనది. సాధారణ ప్రజలకే ఈ వ్యవస్థలు ఇంత క్లిష్టంగా మారుతుంటే, ఆదివాసీ సమాజాల విషయంలో పరిస్థితి మరింత దుర్భరంగా మారుతోంది. ఎందుకంటే ప్రతి వ్యక్తికి స్థిరమైన డాక్యుమెంట్లు, బ్యాంక్ ఖాతాలు, ఇంటర్నెట్, మొబైల్ కనెక్టివిటీ ఉన్నాయనే ఊహతో డిజిటల్ వ్యవస్థలు పనిచేస్తాయి. కానీ ఆదివాసీల జీవిత వాస్తవాలు చాలా భిన్నంగా ఉంటాయి. గతంలో ఆదివాసీ సంక్షేమం అనగానే షెడ్యూల్డ్ ఏరియాలు, అడవులు, భూమితో ముడిపడి ఉండేది. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారింది. వలసలు, పట్టణీకరణ, సంప్రదాయ జీవనాధారాలు దెబ్బతినడం, ఉపాధి మార్గాలు మారడం –ఇవన్నీ కలిసి ఆదివాసీల జీవన భౌగోళికతను మార్చేశాయి. చాలామంది ఆదివాసీలు ఇప్పుడు షెడ్యూల్డ్ ఏరియాలకు వెలుపల, పట్టణాల అంచుల్లో లేదా అనధికారిక కాలనీల్లో అస్థిర జీవితం గడుపుతున్నారు. ఈ మార్పు కేవలం నివాస ప్రాంతాల మార్పుగానే కాక, సంక్షేమ వ్యవస్థలతో వారి సంబంధాన్నే సంక్లిష్టంగా మార్చుతోంది. ప్రస్తుతం అమలవుతున్న 'పేదరిక ఆధారిత లక్షిత విధానాలు' స్థిరమైన చిరునామాలు, భూమి రికార్డులు, ఆధార్ అనుసంధానం, బ్యాంక్ ఖాతాలు వంటి డాక్యుమెంటేషన్‌పై అధికంగా ఆధారపడుతున్నాయి. కానీ వలసలు, అస్థిర జీవన పరిస్థితులు, బలహీనమైన పరిపాలనా గుర్తింపుల కారణంగా అనేక ఆదివాసీ కుటుంబాలకు ఈ డాక్యుమెంట్లను సమకూర్చుకోవడమే కష్టంగా మారుతోంది.ప్రత్యేకంగా యానాది, చెంచు వంటి సమాజాల విషయంలో ఈ సమస్య మరింత తీవ్రమైంది. భూమి, స్థిరమైన ఉపాధి లేకుండా, చెత్త ఏరుకోవడం వంటి అసురక్షిత పనులపై ఆధారపడుతున్న అనేక కుటుంబాలు ప్రభుత్వం ఊహిస్తున్న 'స్థిరమైన పేద కుటుంబం' అనే పరిపాలనా నమూనాలో సరిపోవడం లేదు. ఫలితంగా, అత్యంత అసురక్షిత పరిస్థితుల్లో ఉన్నవారే సంక్షేమ వ్యవస్థలకు దూరమవుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో 'టార్గెటింగ్' కంటే 'యూని వర్సాలిటీ' మరింత కీలకం. సంక్షేమం అనేది భౌగోళికతను కాదు, మనిషిని అనుసరించాలి. ఆదివాసీల హక్కులు వారు ఎక్కడ నివసిస్తున్నారనే దానిపై ఆధారపడి అదృశ్యం కాకూడదు.

## కోహెడలో సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు
## జూన్ 3న వ్యవసాయ మార్కెట్‌కు శంకుస్థాపన

**రంగారెడ్డి, సమయం ప్రతినిధి:** జూన్ 3వ తేదీన కోహెడలో జరిగే రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కార్యక్రమానికి ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, మల్కాజిగిరి పోలీసు కమిషనర్ సుమతితో కలిసి కోహెడలో సీఎం కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు.



ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆదిబట్ల సర్కిల్ తొర్రూర్ డివిజన్ పరిధిలోని కోహెడ రెవెన్యూ సర్వే నంబర్ 167/1లో కోహెడ వ్యవసాయ మార్కెట్ ఏర్పాటుకు జూన్ 3న సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం 239 ఎకరాలు కేటాయించిన నేపథ్యంలో అక్కడ సాగు చేస్తున్న రైతులను గుర్తించి అర్హులైన వారికి న్యాయం చేస్తామని స్పష్టం చేశారు.

ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ.. దేశంలోనే ఎక్కడా లేని విధంగా 239 ఎకరాల్లో అంతర్జాతీయ స్థాయిలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌తో పాటు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నిర్మిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణకు మణిహారంలా కోహెడ మార్కెట్ నిలుస్తుందని పేర్కొన్నారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అందరికీ న్యాయం జరుగుతుందని హామీ ఇచ్చారు.

మల్కాజిగిరి పోలీసు కమిషనర్ సుమతి మాట్లాడుతూ.. సీఎం కార్యక్రమం విజయవంతం అయ్యేలా పోలీస్ శాఖ తరఫున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, ఆర్డీఓ అనంత్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## వెళ్లగొట్టక ముందే పారిపోండి.. బంగ్లా చొరబాటుదారులకు సువేందు వార్నింగ్

మొదటి పేజీ తరువాయి

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లో ఉంటున్న బంగ్లాదేశ్ అక్రమవలసదారులపై చర్యలను సువేందు అధికారి ప్రభుత్వం ముమ్మరం చేసింది. అక్రమవలసదారులను వారి స్వదేశానికి పంపేందుకు చర్యలు తీసుకుంటోంది. 'ప్రభుత్వం చర్యలు తీసుకోకముందే పారిపోండి' అంటూ ముఖ్యమంత్రి తాజాగా హెచ్చరించారు. బంగ్లాదేశ్ అక్రమ వలసదారుల అంశంపై మాట్లాడుతూ, కొత్త చట్టంతో కాకుండా ప్రస్తుతం ఉన్న విదేశీయుల చట్టం కిందే ఈ చర్యలు తీసుకుంటామని చెప్పారు. తక్షణం అక్రమవలసదారులు ఈ ప్రదేశాన్ని వదిలివెళ్లాల్సిందేనని అన్నారు. తమ పౌరులను వెనక్కి తీసుకునే బాధ్యత బంగ్లాదేశ్ ప్రభుత్వంపైనే ఉందన్నారు. భారత్ నుంచి తమ పౌరులను తిరిగి స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నట్టు బంగ్లాదేశ్ ఇప్పటికే చెప్పిందని తెలిపారు. బంగ్లా అక్రమ చొరబాటుదారులను జైళ్లకు పంపవద్దని తాను పోలీసులకు ఆదేశాలు ఇచ్చినట్టు చెప్పారు. 'వారికి మనమెందుకు ఆతిథ్యం ఇవ్వాలి? దేశ వనరులను మనం ఎందుకు దుర్వినియోగం చేయాలి. చొరబాటుదారులు ఏమైనా మన అల్లుళ్లా?' అని ప్రశ్నించారు. బంగ్లా పౌరులు స్వచ్ఛందంగా, శీఘ్రుంగా వెళ్లకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## కర్ణాటకలో అధికార మార్పిడి కాదు, రాజ్యసభ ఎన్నికలపైనే చర్చించా... కాంగ్రెస్ అధిష్టానం

మొదటి పేజీ తరువాయి

కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో కాంగ్రెస్ అధిష్టానం మంగళవారంనాడు జరిపిన ఉన్నత స్థాయి సమావేశం ముగిసింది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్, కర్ణాటక ఇన్‌చార్జి రణ్‌దీప్ సూర్జేవాలా ఈ సమావేశంలో పాల్గొన్నారు. అనతరం కేసీ వేణుగోపాల్ మాట్లాడుతూ, కర్ణాటకలో అధికార మార్పిడికి సంబంధించిన అంశంపై సమావేశంలో ఎలాంటి చర్చా జరగలేదన్నారు. త్వరలో జరుగనున్న కర్ణాటక రాజ్యసభ ఎన్నికలు, ఎమ్మెల్సీ ఎన్నికలపైనే సమావేశంలో చర్చ జరిగినట్టు చెప్పారు.

## ప్రధాన మంత్రి రాష్ట్ర బాల పురస్కార్ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

**మహబూబ్‌నగర్, సమయం ప్రతినిధి:** అసాధారణ ప్రతిభ కనబరిచిన బాలబాలికలకు అందజేసే ప్రధాన మంత్రి రాష్ట్ర బాల పురస్కార్ అవార్డుల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి తెలిపారు.

శౌర్యం, సామాజిక సేవ, పర్యావరణ పరిరక్షణ, క్రీడలు, సాహిత్యం, సాంస్కృతిక రంగం, విజ్ఞాన శాస్త్రం తదితర విభాగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన బాలబాలికలు ఈ అవార్డులకు అర్హులని పేర్కొన్నారు.

ఈ అవార్డులకు 5 నుంచి 18 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన బాలబాలికలు (2026 జూలై 31 నాటికి) దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆసక్తి గల వారు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. దరఖాస్తుల చివరి తేదీ 2026 జూలై 31గా నిర్ణయించబడిందని, బాలబాలికలు, తల్లిదండ్రులు, పాఠశాలల నిర్వాహకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి కోరారు. దరఖాస్తుల కోసం: awards.gov.in.

## ఉపకార వేతనాల దరఖాస్తుల గడువు పొడిగింపు

**మహబూబ్‌నగర్,(సమయం ప్రతినిధి):** 2025–26 విద్యా సంవత్సరానికి పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాల దరఖాస్తుల గడువును ఈ నెల 31 వరకు పొడిగించినట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి తెలిపారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ మరియు మైనార్టీ విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

విద్యార్థులు telanganaepass.cgg.gov.in ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని అవసరమైన ధ్రువపత్రాలను సంబంధిత అధికారులకు సమర్పించాలని పేర్కొన్నారు. అర్హత ఉన్న విద్యార్థులు గడువు తేదీలోపు తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలని అధికారులు కోరారు.

## ఆధునిక రేడియేషన్ థెరపీతో క్యాన్సర్ చికిత్సలో మెరుగైన ఫలితాలు

**మహబూబ్‌నగర్, సమయం ప్రతినిధి:** ప్రస్తుతం క్యాన్సర్ రోగాలకు అనేక రకాల చికిత్స విధానాలు అందుబాటులో ఉన్నాయని, ప్రతి రోగి పరిస్థితిని బట్టి వైద్యం నిర్ణయించబడుతుందని యశోద హాస్పిటల్ సికింద్రాబాద్ బ్రాంచ్ కన్సల్టెంట్ రేడియేషన్ ఆంకాలజిస్ట్ డాక్టర్ టి. శ్రావంతి రెడ్డి తెలిపారు. అందరికీ ఒకే విధమైన చికిత్స అవసరం ఉండదని పేర్కొన్నారు. క్యాన్సర్ చికిత్సలో ప్రధాన ఉద్దేశ్యం వ్యాధిని పూర్తిగా నియంత్రించడం లేదా తగ్గించడం మాత్రమే కాకుండా, రోగి జీవిత నాణ్యతను మెరుగుపరచడం, చికిత్స వల్ల కలిగే సైడ్ ఎఫెక్ట్స్‌ను తగ్గించడం కూడా ముఖ్యమని ఆమె వివరించారు. అవసరమైన చికిత్సను తగ్గించకుండా దుష్ప్రభావాలను తగ్గించే దిశగా ఆధునిక వైద్యం అందుబాటులో ఉందన్నారు. ప్రస్తుతం ఆసుపత్రుల్లో అత్యాధునిక రేడియేషన్ యంత్రాలను ఉపయోగిస్తున్నామని, ఇటీవల వాటిని మరింత అప్‌గ్రేడ్ చేసినట్లు తెలిపారు. క్యాన్సర్ ఉన్న భాగాన్ని మాత్రమే లక్ష్యంగా చేసుకుని చికిత్స అందించడం వల్ల చుట్టుపక్కల సాధారణ కణజాలానికి నష్టం తక్కువగా ఉంటుందని చెప్పారు. ట్రీట్మెంట్‌ను మరింత ఖచ్చితత్వంతో అందించడంతో పాటు పొజిషనింగ్ లోపాలను తగ్గించే సాంకేతికత అందుబాటులోకి వచ్చిందన్నారు. రోగి శరీరంలో చికిత్స సమయంలో వచ్చే మార్పులను బట్టి వైద్యంలో మార్పులు చేసే విధానాన్ని "అడాప్టివ్ రేడియోథెరపీ"గా పిలుస్తారని తెలిపారు. అలాగే ఫాస్ట్ ఇమేజింగ్ టెక్నిక్ ద్వారా ఒక్క శ్వాసలోనే స్కాన్ పూర్తి చేయగలుగుతున్నామని, దీని వల్ల చికిత్స




సమయం తగ్గి రోగికి మరింత సౌకర్యం కలుగుతోందన్నారు. ప్రతి రోగి పరిస్థితి భిన్నంగా ఉంటుందని, వైద్యుల సూచనల మేరకే చికిత్స తీసుకోవాలని సూచించారు. ఆధునిక రేడియేషన్ థెరపీ వల్ల మెరుగైన ఫలితాలు పొందే అవకాశం పెరుగుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యశోద హాస్పిటల్ సికింద్రాబాద్ బ్రాంచ్ మార్కెటింగ్ ప్రతినిధులు ఆర్. రోహిత్ కుమార్, బి. సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు.

# మైనారిటీ సంక్షేమానికి మరో అడుగు

**మహబూబ్‌నగర్, (సమయం ప్రతినిధి):** మైనారిటీ సంక్షేమ నిధులు రూ.50 లక్షల వ్యయంతో నిర్మించిన అహెలే హద్దీస్ ప్రహరీ గోడను ప్రభుత్వ విప్ & ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఘనంగా ప్రారంభించారు. ప్రారంభోత్సవం అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీల అభివృద్ధి, వారి సామాజిక–ఆర్థిక స్థితిగతుల మెరుగుదల కోసం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో కొనసాగుతున్న ప్రజా ప్రభుత్వం మైనారిటీలకు విద్య, ఉపాధి, మౌలిక వసతుల కల్పనలో ప్రత్యేక దృష్టి సారిస్తున్నదని తెలిపారు. అహెలే హద్దీస్ ఈద్గా అభివృద్ధి కోసం నిర్మించిన ఈ ప్రహారీ గోడ రంజాన్ మరియు బక్రీద్ పర్వదినాల సందర్భంగా చాలా ఉపయోగ పడుతుందని చెప్పారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వం మరింత ప్రాధాన్యత ఇస్తుందని ఆయన అన్నారు. మైనారిటీ వర్గాల అభ్యున్నతికి అవసరమైన ప్రతి కార్యక్రమాన్ని అమలు చేయడంలో ఎలాంటి రాజీ పడబోమని స్పష్టం చేశారు. ఇంకా అద్భుతంగా ఈద్గాను తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉన్నామని, ఈద్గాను లేవలింగ్ చేసి, మహిళల కోసం ఒక షెడ్ కూడా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. వాహనాల పార్కింగ్ తదితర అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సాధించాలని ఇంజనీరింగ్ సిబ్బందికి సూచించారు. ప్రజా సంక్షేమ కార్యక్రమాల గురించి వివరిస్తూ, పేద కుటుంబాలకు తక్కువ ధరలో నిత్యావసర వస్తువులు అందించే సూపర్ మార్కెట్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మహబూబ్ నగర్ లో హిందూ , ముస్లిం, క్రైస్తవులు అన్ని మతాల ప్రజలు సోదరభావంతో కలిసి జీవించడం మన సంప్రదాయం అని అన్నారు. ఎలాంటి సమస్యలైన శాంతి యుతంగా పరిష్కరించుకోవాలని ఆయన చెప్పారు. ప్రతి నియోజకవర్గంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్పొరేట్ స్థాయి విద్యను గ్రామీణ ప్రాంతాలకు తీసుకువస్తున్నాం అని ఆయన చెప్పారు. ఇప్పటికే కొన్ని చోట్ల

**50 లక్షలతో నిర్మించిన అహెలే హద్దీస్ ఈద్గా ప్రహారీ గోడను ప్రారంభించిన ఎమ్మెల్యే శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి**





ప్రారంభమై, త్వరలో మరిన్ని ప్రారంభం కానున్నాయి” అని చెప్పారు. “మహబూబ్‌నగర్‌లో ఇంజినీరింగ్ కాలేజ్ ప్రారంభించి, తక్కువ ఫీజుతో నాణ్యమైన విద్య అందిస్తున్నామన్నారు . ట్రిపుల్ ఐటీ వంటి సంస్థల్లో కూడా మన ప్రాంత విద్యార్థులకు అవకాశాలు పెరుగుతున్నాయని, ఇప్పుడు ప్రజల ఆలోచన కూడా మారుతోందని – గొడవల కంటే విద్యపై దృష్టి పెడుతున్నారు” అని పేర్కొన్నారు. అంతకుముందు ఈద్గా ముఖద్వారాన్ని పరిశీలించి, తగు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ శ్రీమతి గుమ్మాల మమత శ్రీనివాస్, మైనారిటీ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిరాజ్ ఖాద్రీ, నగర కార్పొరేటర్లు షబ్బీర్, అవేజ్, ఉమర్ కొత్వాల్, అహెలే హద్దీస్ ఈద్గా సభ్యులు సైఫోద్దీన్, ఇసా అమోధి, జాబీర్ బిన్ సయ్యిద్, నయీం సిద్దీఖి, సలీం స్థానిక ప్రజాప్రతినిధులు , పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## లంచం తీసుకుంటూ ఏసీబీకి అడ్డంగా దొరికిపోయిన వడ్డేపల్లి మండల సర్వేయర్ బ్రహ్మయ్య



**జోగులాంబ గద్వాల్ జిల్లా :** జోగులాంబ గద్వాల్ జిల్లా అల్లంపూర్ తాలూకా వడ్డేపల్లి మండల రెవెన్యూ పరిధిలో అవినీతి నిరోధక శాఖ (ACB) అధికారులు మంగళవారం మెరుపు దాడి నిర్వహించారు. భూమికి సంబంధించిన అధికారిక సర్వే నిర్వహించి, హద్దులు నిశ్చయించేందుకు ఒక బాధిత రైతు (ఫిర్యాదుదారుడు) నుండి రూ. 10,000/- లంచం తీసుకుంటుండగా వడ్డేపల్లి మండల సర్వేయర్ బ్రహ్మయ్యను ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఫిర్యాదుదారుడు తన పట్టా భూమిని సర్వే చేయాల్సిందిగా వడ్డేపల్లి మండల సర్వేయర్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. అయితే, అధికారికంగా చేయాల్సిన ఈ విధిని సకాలంలో పూర్తి చేయకుండా, సర్వే ప్రక్రియను ముందుకు తీసుకెళ్లడానికి సర్వేయర్ బ్రహ్మయ్య రూ. 10,000/- లంచం డిమాండ్ చేశారు. లంచం ఇవ్వడం ఇష్టం లేని బాధిత రైతు ఈ విషయమై అవినీతి నిరోధక శాఖ అధికారులను ఆశ్రయించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన ఏసీబీ డీఎస్పీ మరియు వారి బృందం పక్కా ప్రణాళికతో వడ్డేపల్లిలో నిఘా పెట్టారు. బుధవారం సర్వేయర్ బ్రహ్మయ్య తన కార్యాలయంలో ఫిర్యాదుదారుడి నుండి సదరు లంచం సొమ్మును స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. నిందితుడి నుంచి లంచం సొమ్ము రూ. 10,000/- స్వాధీనం చేసుకున్నట్లు ఏసీబీ అధికారులు ధృవీకరించారు. బ్రహ్మయ్యను అదుపులోకి తీసుకుని, అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి, తదుపరి విచారణ నిమిత్తం హైదరాబాద్‌లోని నాంపల్లి ప్రత్యేక ఏసీబీ కోర్టుకు తరలించనున్నట్లు అధికారులు వెల్లడించారు.

## పార్చర్ల శ్రీ సవారమ్మ అవ్వ కు శారీ ను సమర్పించిన మాజీ జడ్పీటీసీ బాసు శ్యామల హనుమంతు నాయుడు గారు

**ధరూర్ :** ఈరోజు గద్వాల నియోజకవర్గం ధరూర్ మండలం పార్చర్ల గ్రామంలో శ్రీ సవారమ్మ అవ్వ దేవర మహోత్సవం సందర్భంగా సవారమ్మ అవ్వ ను దర్శించుకొని,ప్రత్యేక పూజలు నిర్వహించి,చీర,గాజుల,పసుపు, కుంకుమ లను సమర్పించి, అమ్మ వారి ఆశీస్సులను పొందారు... ఈ కార్యక్రమంలో వెంకటేష్ నాయుడు, శ్రీరాములు,రాముడు,తిమ్మప్ప గౌడ్, రాజు,పూడూరు రఘు నాయుడు, రాము, శాంతన్న,సవారీ,ఆంజనేయులు, గరుశాలి,నరసింహులు, గోవిందు, వీరేష్, తిమ్మప్ప, రాముడు, మల్లికార్జున్, మహేందర్,మరియు గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నాళ్లు పెట్రో మంట...

ముంబై : పెంచుడు కార్యక్రమం దర్జాగా సాగిపోతోంది. జనాలకు కూడా అలవాటైపోతుంది. మొదట్లో మూడు రూపాయలు పెంచారు. ఆ తర్వాత 90 పైసలు వడ్డించారు. ఇప్పుడు ఏకంగా 2.84 రూపాయలు పెంచేశారు. ఇలా పెంచుకుంటూ పోవడం వల్ల సామాన్య జనం బతికే పరిస్థితి లేకుండా పోతోంది. ధరల స్థాయి నిరంతర పెరుగుతున్న నేపథ్యంలో మార్కెట్లో ప్రతి వస్తువు ధర కూడా ఆకాశంలో విహరిస్తోంది. పెట్రోల్ ధరల పెరుగుదలను సాకుగా చూపించి వ్యాపారులు ఇతర వస్తువుల ధరలు కూడా పెంచుతున్నారు. దీనివల్ల సగటు మనిషి బతకలేక పోతున్నాడు.సోమవారం ఉదయం నుంచి మన దేశంలో డీజిల్, పెట్రోల్ ధరలు మరింత పెరిగాయి. పెట్రోల్ పై 2.84.. డీజిల్ పై 2.86 రూపాయల ధర పెరిగింది. నష్టాలు వస్తున్నాయని సాకుగా చూపించిన దేశీయ చమురు రంగ సంస్థలు ధరలను విపరీతంగా పెంచాయి. ఈ ధరలు సోమారం ఉదయం నుంచి అమలులోకి వచ్చాయి. ఇప్పటికే మూడు విడతలుగా డీజిల్, పెట్రోల్ ధరలను చమురు రంగ సంస్థలు పెంచేశాయి.. ఇప్పుడు పెరిగిన ధర ప్రకారం ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర 102.12, లీటర్ డీజిల్ ధర 95.20కి విక్రయిస్తున్నారు.. ముంబైలో లీటర్ పెట్రోల్ ధర 111.12, చెన్నైలో 107.77, విజయవాడలో 117.19, డీజిల్ 104.88, గుంటూరులో పెట్రోల్ 117.59, డీజిల్ 105.28, హైదరాబాదులో పెట్రోల్ 115.58, డీజిల్ 103.74 ధరలో లభ్యమవుతూ ఉంటుంది.

# తెలంగాణలో రేషన్ కార్డుల ఏరివేత

హైదరాబాద్ : తెలంగాణలో ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి తెల్ల రేషన్ కార్డులు పొందిన ప్రభుత్వ, భారీగా వేతనాలు పొందే సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల కార్డులను పౌరసరఫరాల శాఖ రద్దు చేస్తోంది. రూ. 6 లక్షల కంటే ఎక్కువ వార్షిక ఆదాయం ఉండి ఐటీ రిటర్న్స్ దాఖలు చేసేవారిని, పరిమితికి మించి భూమి ఉన్నవారిని అనర్హులుగా గుర్తిస్తున్నారు. అయితే బ్యాంకు రుణాల కోసం తప్పుడు ఆదాయం చూపిన నిజమైన అర్హులకు అన్యాయం జరగకుండా అధికారులు క్షేత్రస్థాయి విచారణ జరుపుతున్నారు.తెలంగాణలో నిరుపేదలకు అందాల్సిన తెల్ల రేషన్ కార్డులను దుర్వినియోగం చేస్తున్న అనర్హులపై పౌరసరఫరాల శాఖ ఉక్కుపాదం మోపుతోంది. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా తప్పుడు సమాచారంతో కార్డులు పొంది ఇన్నాళ్లూ దర్జాగా రేషన్ బియ్యాన్ని, ఇతర ప్రభుత్వ సదుపాయాలను అనుభవిస్తున్న వారి ఏరివేత ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేసింది. ఈ తనిఖీల్లోగ్భ్రాంతికరమైన విషయాలు వెలుగుచూశాయి. రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న కొందరితో పాటు, నెలకు రూ. 50 వేల నుంచి రూ. 2 లక్షల వరకు భారీ వేతనాలు తీసుకునే సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల పేరిట కూడా తెల్ల రేషన్ కార్డులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు.ఉమ్మడి కుటుంబం నుంచి విడిపోయి ప్రత్యేకంగా కొత్త కార్డులు మంజూరు చేయించుకున్న వారిలో ఈ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు అధికంగా ఉన్నారు. ఇన్నాళ్లూ వీరంతా తమ తల్లిదండ్రుల రేషన్‌కార్డుల్లో సభ్యులుగా కొనసాగడం వల్ల వీరి అసలు వివరాలు, ఆదాయం బహిర్గతం కాలేదు. ప్రస్తుతం డేటా విశ్లేషణ ద్వారా వీరి గుట్టు రట్టవడంతో అలాంటి వారి కార్డులను అధికారులు తొలగిస్తున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన తాజా నిబంధనల ప్రకారం.. లబ్ధిదారుల వార్షిక ఆదాయం రూ. 6 లక్షల కంటే ఎక్కువగా ఉండి, ఆదాయ పన్ను చెల్లిస్తున్న వారి కార్డులను తక్షణమే రద్దు చేస్తున్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో 3.20 ఎకరాల కంటే ఎక్కువ తరి భూమి లేదా 7.20 ఎకరాల కంటే ఎక్కువ కుష్కి భూమి ఉన్న వారి రేషన్ కార్డులను కూడా ఏరివేస్తున్నారు. ప్రభుత్వ విచారణతో ఇన్నాళ్లూ లబ్ధి పొందిన అనర్హులైన కార్డుదారుల్లో ప్రస్తుతం తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది.అనర్హుల ఏరివేత ప్రక్రియలో నిజమైన పేదలకు, అర్హులకు అన్యాయం జరగకుండా ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకుంటోంది. కేంద్ర ప్రభుత్వం పంపిన లబ్ధిదారుల ప్రాథమిక జాబితాలో సాంకేతిక పొరపాట్ల వల్ల కొందరు అర్హుల పేర్లు కూడా నమోదయ్యాయి. వార్షిక ఆదాయం రూ. 6 లక్షలుగా తప్పుగా చూపిస్తున్న వారి వివరాలను అధికారులు క్షేత్రస్థాయిలో పునఃపరిశీలిస్తున్నారు. మరికొందరు లబ్ధిదారులు బ్యాంకుల నుంచి వ్యాపార, వ్యక్తిగత రుణాలు పొందటం కోసం ఐటీ రిటర్న్స్‌లో లేని ఆదాయాన్ని ఉన్నట్లుగా చూపించినట్లు విచారణలో వెల్లడైంది. ఇలాంటి వారికి అధికారులు నేరుగా ఫోన్ చేసి వివరాలు సేకరిస్తున్నారు. లబ్ధిదారులు చెప్పిన సమాధానాలు, వారు సమర్పించిన పత్రాలపై విచారణ అధికారి సంతృప్తి చెందితే వారి కార్డులను యథావిధిగా కొనసాగిస్తున్నారు. అనుమానాస్పద కార్డుల విషయంలో అధికారులు నేరుగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారు చెప్పిన సమాచారం వాస్తవమా కాదా అనే అంశాన్ని అన్ని కోణాల్లో ఆరా తీస్తూ నివేదికలు సిద్ధం చేస్తున్నారు.

# హైదరాబాద్‌పై కేటీఆర్ వ్యూహాత్మక గాలం

హైదరాబాద్ : తెలంగాణలో అధికారాన్ని కోల్పోయిన తర్వాత గులాబీ పార్టీ తన తదుపరి ప్రధాన లక్ష్యంగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలపై గురిపెట్టింది. కూకట్‌పల్లిలో జరిగిన పార్టీ శ్రేణుల విస్తృత స్థాయి సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు, ప్రకటించిన హామీలు పూర్తిగా గ్రేటర్ ఎన్నికల్లో విజయం సాధించడమే లక్ష్యంగా సాగాయి. గత ఎన్నికల్లో హైదరాబాద్ ప్రజలు తమకు అందించిన తిరుగులేని మద్దతును కాపాడుకుంటూనే, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడం ద్వారా నగరంలో పట్టు బిగించాలని బీఆర్ఎస్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది.హైదరాబాద్ నగర అభివృద్ధిలో మౌలిక వసతుల కల్పన అత్యంత కీలకం. గత బీఆర్ఎస్ పాలనలో నగరానికి 24 గంటల నిరంతర విద్యుత్ అందించామని గుర్తుచేసిన కేటీఆర్, రాబోయే రోజుల్లో తాము మళ్లీ అధికారంలోకి వస్తే నగరంలోని ప్రతి ఇంటికి 24 గంటల పాటు నిరంతర తాగునీటిని సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. మిషన్ భగీరథ ద్వారా ఇప్పటికే ఇంటింటికీ పైప్‌లైన్ కనెక్షన్లు ఇచ్చామని, 24 గంటల నీటి సరఫరా బాధ్యతను స్వయంగా తానే భుజాన వేసుకుంటానని ప్రకటించడం ద్వారా నగర ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. సమైక్య రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన నాటి కరెంటు కోతలు, నీటి కొరతలను ప్రజలకు గుర్తు చేస్తూ నాటికీ, నేటికీ ఉన్న వ్యత్యాసాన్ని విశ్లేషించారు.గడిచిన రెండున్నర ఏళ్ల కాంగ్రెస్ పాలనలో హైదరాబాద్ నగరానికి ఒక్క రూపాయి కూడా అదనంగా ఖర్చు చేయలేదని కేటీఆర్ దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అసమర్థ ప్రభుత్వంగా అభివర్ణిస్తూ తీవ్ర విమర్శలు చేశారు. బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన ఫ్లైఓవర్లు, టిమ్స్ ఆసుపత్రుల రిబ్బన్లు కట్ చేస్తూ సీఎం రేవంత్ రెడ్డి అబద్ధాలు చెప్తున్నారని ఆరోపించారు. గడిచిన రెండున్నర సంవత్సరాలలో హైదరాబాద్ లో కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క డబుల్ బెడ్రూమ్ ఇల్లు కూడా నిర్మించలేదన్నారు. ఒకవేళ ఒక్క ఇల్లయినా నిర్మించినట్లు నిరూపిస్తే నేను రాజకీయ సన్యాసం చేస్తానని కేటీఆర్ సవాల్ విసిరారు. మహిళలకు 2500 రూపాయల సాయం, పెన్షన్ల పెంపు వంటి అడ్డగోలు హామీలతో కాంగ్రెస్ ప్రతి వర్గాన్ని మోసం చేసిందని, అందుకే అవగాహన ఉన్న హైదరాబాద్ ప్రజలు అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా ఇవ్వలేదని గుర్తుచేశారు.హైదరాబాద్ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక లాంటి రియల్ ఎస్టేట్ రంగం కాంగ్రెస్ పాలన వల్ల పూర్తిగా దెబ్బతిందని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల ఉపాధి కోల్పోయిన లక్షలాది మంది భవన నిర్మాణ కార్మికులు, సెంట్రింగ్ కార్మికులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి రాగానే ఈ కార్మికుల కోసం ప్రత్యేక బీమా సౌకర్యంతో పాటు ఇతర సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తామని ప్రకటించడం ద్వారా నగరంలోని వలస, కార్మిక ఓటు బ్యాంకును తమవైపు తిప్పుకునే వ్యూహాన్ని అమలు చేశారు. గత పదేళ్లలో అభివృద్ధిపైనే పూర్తి ఫోకస్ పెట్టామని, ఈసారి అధికారంలోకి వస్తే కష్టపడిన కార్యకర్తలకు, నేతలకు పూర్తి న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు.

## తమిళనాడులో పుష్ప పాలిటిక్స్...

చెన్నై : తమిళనాడు రాజకీయాల్లో ఎన్నికలు ముగిసినా పొలిటికల్ హీట్ ఏమాత్రం తగ్గడం లేదు. తాజాగా అన్నాడీఎంకేకు ఆ పార్టీ ఎమ్మెల్యేలు కోలుకోలేని బిగ్ షాక్ ఇచ్చారు. ముగ్గురు సిట్టింగ్ ఎమ్మెల్యేలు తమ పార్టీ సభ్యత్వంతో పాటు ఎమ్మెల్యే పదవులకు కూడా రాజీనామా చేశారు. అసెంబ్లీలో జరిగిన బలపరీక్ష సమయంలోనే ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం ప్రభుత్వానికి మద్దతు ఇచ్చిన వీరు.. ఇప్పుడు అధికారికంగా ఆ పార్టీలో చేరేందుకు సిద్ధమయ్యారు. మధురాంతకం ఎమ్మెల్యే మరగతం కుమరవేల్ నేతృత్వంలో.. పెరుందురై ఎమ్మెల్యే జయకుమార్, ధారాపురం ఎమ్మెల్యే సత్యభామలు చెన్నై సచివాలయంలో స్పీకర్ జె.సి.పి. ప్రభాకరన్‌ను కలిసి తమ రాజీనామా లేఖలను సమర్పించారు.ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేసిన వెంటనే ఈ ముగ్గురు నేతలు విజయ్ ప్రభుత్వంలో కీలక మంత్రిగా ఉన్న ఆధవ్ అర్జునను నేరుగా కలిశారు. వారికి మంత్రి శాలువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. త్వరలోనే వీరు ముఖ్యమంత్రి విజయ్‌ను కూడా కలవనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యభామ మాట్లాడుతూ.. “తమిళగ వెట్రి కళగం ప్రభుత్వం ఏర్పడిన 15 రోజుల్లోనే, తాము దివంగత ముఖ్యమంత్రి జయలలిత సుపరిపాలనను చూస్తున్నాం” అంటూ భావోద్వేగానికి గురయ్యారు. దీనిపై మంత్రి ఆధవ్ అర్జున స్పందిస్తూ.. ముఖ్యమంత్రి విజయ్‌ను నమ్మి వచ్చిన మీకు ఇక అంతా మంచే జరుగుతుంది.

# విద్యార్థులపై మాదకద్రవ్యాల ప్రభావాన్ని నిరోధించాలి



## జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య

**సమయం ప్రతినిధి, మంచిర్యాల :** విద్యార్థులు, యువతపై మాదకద్రవ్యాల ప్రభావాన్ని నిరోధించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో గల కలెక్టర్ సమావేశ మందిరంలో డిసిపి భాస్కర్ తో కలిసి మాదకద్రవ్యాల నియంత్రణపై త్రైమాసిక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల ఉత్పత్తి, రవాణా, విక్రయం, వినియోగాన్ని నిరోధించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. మాదకద్రవ్యాలు వినియోగించడం వల్ల కలిగే నష్టాలను ర్యాలీలు, వ్యాసరచన , చిత్రలేఖనం ఇతర వివిధ రకాల పద్ధతుల ద్వారా, మానసిక వైద్య నిపుణులచే శిబిరాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలని తెలిపారు. మాదకద్రవ్యాలు నియంత్రించడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైనదని, విద్యార్థుల అసాధారణ ప్రవర్తనను పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో డ్రగ్స్ రిహాబిటేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, బాధితులకు సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో గంజాయి సాగు చేయకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పాఠశాలలు, కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేకంగా సిబ్బందిని ఏర్పాటు చేయాలని తెలిపారు. చట్ట విరుద్ధంగా మద్యం, గంజాయి, సిగరెట్లను విక్రయించే లైసెన్స్ లేని దుకాణాలను సీజ్ చేయాలని తెలిపారు. మాదక ద్రవ్యాల నియంత్రణలో అధికార యంత్రాంగం సమిష్టిగా పని చేయాలని తెలిపారు. డి.సి.పి. మాట్లాడుతూ మాదకద్రవ్యాల తరలింపు పై ప్రత్యేక నిఘా ఏర్పాట్లు చేసి నిరోధించడం జరుగుతుందని, ఎక్కడైనా మత్తుపదార్థాల నిల్వ ఉన్నట్లు తెలిస్తే వెంటనే డయల్ 100లో సమాచారం అందించి తగ్గుముఖం పట్టేలా సమన్వయంతో పని చేయాలని తెలిపారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా అరికట్టేందుకు జిల్లా సరిహద్దులలో శాశ్వత చెక్ పోస్టులు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్, విద్య, సంక్షేమ, వైద్య ఆరోగ్య, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి

**తెలంగాణ వ్యవసాయకార్మిక సంఘశీ వనపర్తి జిల్లా అధ్యక్షులు యస్. అజయ్ డీమాండ్.**



**వనపర్తి :** ఇటీవల వనపర్తి జిల్లాలో ఉపాధి కూలీలు పనిప్రదేశాలాల్లో ముగ్గురు కూలీలు కొత్తకోట మండలం పాలెంకు చెందిన గుండె శాంతమ్మ మట్టి కూలి అదేవిదంగా మదనాపూర్ మండలం లోని అజ్జకొల్లు గ్రామానికి చెందిన కావాలి గోవిందమ్మ ఉపాధి పని లో భాగంగా బావిలో నుంచి నీళ్లు తేవడానికి పొయ్యి మృతి చెందినదని. సోమవారం నాడు వనపర్తి మండలంఅచ్చుతపురం కుచెందిన కురుమయ్య చింతల చెరువులో ఉపాధి పనులు చేస్తూ కుప్ప కూలి అక్కడే చనిపోయారు అదేవిదం గా ఆత్మకూరు మండలంలొని బాలకిష్టాపూర్ కు చెందిన సైదా బేగం ఉపాధి పని దగ్గర కాలికి గడ్డ పారా గుచ్చు కొని తీవ్రంగా గాయలపాలు అయ్యిందని వాపోయారు. ఇవిదంగాజిల్లాలో ఉపాధి పని కి వెళ్లి ముగ్గురు కూలి లు చనిపోయారని అట్టి కుటుంబానికి ఒక్కరికి 5లక్షల ఎగ్స్ గ్రేసీయఇవ్వాలని డీమాండ్ చెశారు అదేవిదంగా ఆయా కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలనీ కోరారు బాలకిష్టాపూర్‌కు చెందిన సైదా బేగం కు ప్రయివేటుహాస్పిటల్ ల్లో మెరుగైన వైద్యం అందించాలని విజ్ఞప్తి చేశారు. పని జరిగే ప్రదేశాల్లో మంచినీటి వసతి ఏర్పాటు తో పాటు టెంట్ల సౌకర్యం. ఫస్ట్ ఎయిడ్ బాక్స్ లు అందుబాటులో ఉంచాలని డీమాండ్ చెశారు.ఇటువంటి ఘటనలు జిల్లాలో మళ్లీ జరుగ కుండా అధికారులు అప్రమత్తం గా వ్యవహరించాలని సూచించారు.

## మధు హత్య కేసులో ఐదుగురి అరెస్ట్

సూర్యాపేట : సూర్యాపేటలో సంచలనం సృష్టించిన బీఆర్ఎస్ నేత చింతలపాటి మధు హత్య కేసులో ఐదుగురు అరెస్ట్ అయ్యారు. మిద్దె జీవన్, చింతా సైదులు, మేదరి ప్రసాద్, మిద్దె ఆనంద్, కక్కిరేణి భరత్ చంద్ లను పోలీసులు అరెస్టు చేసారు. 2007లో జరిగిన కాంగ్రెస్ నేత మిద్దె రవీందర్ హత్యకు ప్రతీకారంగానే మధు హత్య జరిగింది. తండ్రి హత్యకు ప్రతీకారంగా రవీందర్ కొడుకు మిద్దె జీవన్ మధును హత్య చేసినట్లు పోలీసులు నిర్ధారించారు.

## మహిళపై దారుణ దాడి చైన్ స్నాచింగ్కు యత్నం

మేడ్చల్ : మహిళపై దారుణంగా దాడి చేసి తరువాత చైన్ స్నాచింగ్ కు ప్రయత్నం జరిగింది. కొంపల్లి జయభేరి కాలనీలో ఆయిల్ షాప్ నిర్వహిస్తున్న యజమానురాలిపై దుండగుడు దారుణంగా దాడి చేసి, చైన్ స్నాచింగ్కు ప్రయత్నించాడు. బాధిత మహిళ కేకలు విని స్థానికులు అక్కడికి చేరుకుని, నిందితుడిని చితకబాది పోలీసులకు అప్పగించారు.

# పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలి

**వీపనగండ్ల మండల కేంద్రంలో ఆటోకు తాళ్లు కట్టి లాగుతూ వినూత్నంగా నిరసన తెలిపిన సిపిఎం నేతలు**




**వనపర్తి వీపనగండ్ల:** సిపిఎం వీపనగండ్ల మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్,డీజిల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ వీపనగండ్ల మండల కేంద్రంలోని ఆటోకు తాళ్ళు కట్టి లాగుతూ నిరసన తెలపడం జరిగింది. ఈ నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం పార్టీ మండల కార్యదర్శి డి.బాల్ రెడ్డి మాట్లాడుతూ...కేంద్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ధరల పెరుగుదలను కట్టడి చేస్తామని చెప్పి దేశ ప్రజలపై ఆర్థిక భారాన్ని మోపే విధంగా పెట్రోల్ డీజిల్ ధరలను పెంచడం సిగ్గుచేటు అన్నారు. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గినప్పుడు దేశంలో ఇంధన ధరలు తగ్గించకుండా ప్రజలపై భారాన్ని మోపడం ఎంతవరకు సమంజసమన్నారు. ఎన్నికల అనంతరం మే 15వ తేదీ నుంచి నేటి వరకు నాలుగు సార్లు పెట్రోల్,డీజిల్ ధరలు పెంచడం వల్ల నిత్యవసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటూతున్నాయని ఇది పేద,మధ్య తరగతి ప్రజల జీవనానికి దుర్భరం చేస్తుందని విమర్శించారు. కార్పొరేట్ సంస్థల లాభాల కోసం కాకుండా ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వాలు పనిచేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు సి.హెచ్. వెంకటయ్య,నక్క ఈశ్వర్,ఎం.ఆది, వెంకటేశ్వర గౌడ్, వెంకన్న,రామకృష్ణ, నవీన, రఘు తదితరులు పాల్గొన్నారు.

## వర్మ చుట్టూ పెరుగుతున్న టీడీపీ మద్దతు..

కాకినాడ :పిఠాపురం రాజకీయాల్లో మరోసారి ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. టీడీపీ నేత పిఠాపురం వర్మ అలియాస్ ఎస్వీఎస్ఎన్ వర్మ పేరు ఇప్పుడు మళ్లీ చర్చనీయాంశంగా మారింది. 2024 ఎన్నికల సమయంలో ఆయనకు ఎమ్మెల్యే టికెట్ దక్కకపోవడం అప్పట్లో పెద్ద రాజకీయ చర్చకు దారితీసింది. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పిఠాపురం నుంచి పోటీ చేయాలని నిర్ణయించడంతో వర్మకు టికెట్ అవకాశాలు ముగిశాయి.అప్పుడు పార్టీ పెద్దలు ఎమ్మెల్సీ పదవి ఇస్తామని హామీ ఇచ్చారని వర్మ అనుచరులు భావించారు. అయితే ఆ హామీ అమలు కాలేదని వారు ఇప్పుడు బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇదే సమయంలో వర్మకు ఉన్న నియోజకవర్గ ఇంచార్జి బాధ్యతలు కూడా తొలగించడంతో ఆయన వర్గం మరింత నిరాశకు గురైంది. ఆ పరిణామాల తర్వాత వర్మ కాకినాడ కు వెళ్లి అక్కడే ఉంటున్నారు.అయితే రాజకీయాలకు పూర్తిగా దూరంగా ఉంటారని అనుకున్న సమయంలో కొత్త పరిణామాలు కనిపిస్తున్నాయి. పిఠాపురం ప్రాంతానికి చెందిన టీడీపీ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో కాకినాడలోని వర్మ నివాసానికి వెళ్లడం ఇప్పుడు రాజకీయంగా చర్చనీయాంశమైంది. గ్రామ స్థాయి నాయకుల నుంచి కీలక నేతల వరకు చాలామంది ఆయనను కలిసి మద్దతు ప్రకటిస్తున్నారని సమాచారం.పిఠాపురం పరిధిలోని పలు గ్రామాల నుంచి వచ్చిన నాయకులు వర్మకు ధైర్యం చెబుతూ ఆయన ఇంకా తమ నాయకుడేనని చెబుతున్నారని రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. కొందరు నేతలు నియోజకవర్గంలో జరుగుతున్న పరిస్థితులను కూడా ఆయనకు వివరిస్తున్నారని అంటున్నారు. దీంతో వర్మ పరోక్షంగా అయినా పిఠాపురం రాజకీయాలపై దృష్టి కొనసాగిస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.ఇదే అంశం ఇప్పుడు జనసేన వర్గాల్లో అసహనానికి కారణమైందని సమాచారం. ఇంచార్జి బాధ్యతలు లేని పరిస్థితిలో కూడా వర్మ నియోజకవర్గ రాజకీయాల్లో చురుకుగా వ్యవహరించడం సరైన విధానం కాదని కొందరు జనసేన నాయకులు అభిప్రాయపడుతున్నట్లు తెలుస్తోంది. కూటమి ధర్మానికి ఇది విరుద్ధమని కూడా వారు వ్యాఖ్యానిస్తున్నారట.అయితే తనను కలవడానికి వచ్చే నాయకులను తాను ఆపలేనని వర్మ చెబుతున్నట్లు సమాచారం. తమ పార్టీ కార్యకర్తలు అభిమానంతో వస్తుంటే వారిని నిరాకరించడం.

# క్యాన్సర్ ను ప్రారంభ దశలో గుర్తించి శస్త్రచికిత్స చేస్తే ప్రమాదాలు తగ్గించవచ్చు

**-లాపరోస్కోపిక్ అంకాలజీ సర్జరీతో మంచి ఫలితాలు.**
**-డాక్టర్ జి.దయాకర్ రావు సూచన**




**వనపర్తి, సమయం ప్రతినిధి:** అపెండిక్యులర్ మాస్, కోలస్ క్యాన్సర్ వంటి సమస్యలను ప్రారంభ దశలో గుర్తించి సరైన శస్త్రచికిత్స చేయడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చని మలక్ పేట యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి కన్సల్టెంట్ సర్జికల్ అంకాలజిస్ట్ డాక్టర్ జి. దయాకర్ రావు చెప్పారు. అత్యాధునిక లాపరోస్కోపిక్, అంకాలజీ సర్జరీతో మంచి ఫలితాలు సాధించవచ్చని ఆయన వివరించారు. మంగళవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని ఎం వై ఎస్ బంకేట్ హాల్లో క్యాన్సర్ పై మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జి. దయాకర్ రావు మాట్లాడుతూ అపెండి క్యులర్ మాస్తో కూడిన కొలస్ క్యాన్సర్ కు అరుదైన చికిత్స యశోద ఆసుపత్రిలో విజయవంతంగా జరిగిందని చెప్పారు. వనపర్తి జిల్లాకు చెందిన 51 ఏళ్ల సూగురు యాదమ్మ తీవ్రమైన కడుపునొప్పి, జ్వరం, కడుపులో గడ్డతో యశోద సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో చేరిందని, పరీక్షల్లో అపెండిక్యులర్ మాస్తో పాటు కోలస్ క్యాన్సర్ ఉన్నట్లు వైద్యులు గుర్తించారని చెప్పారు. కన్సల్టెంట్ జనరల్, లాపరోస్కోపిక్, రోబోటిక్ సర్జన్ డాక్టర్ టి. సురేందర్ రెడ్డి ఆధ్వర్యంలో రోగికి లాపరోస్కోపిక్ ఎక్స్ప్లొరేషన్, అడ్హీజియోలిసిస్, ఒమెంటల్ బయాప్సీ నిర్వహించారని తెలిపారు. అనంతరం డాక్టర్ దయాకర్ రావు పర్యవేక్షణలో రైట్ హెమి కోలెక్టమీ,ఐలీయో ట్రాన్స్వర్స్ అనాస్థమోషన్ శస్త్ర చికిత్స విజయవంతంగా నిర్వహించారని తెలిపారు. పెద్దప్రేగు భాగంలో గడ్డతోపాటు చుట్టుపక్కల భాగాలకు అంటుకుపోయిన ఇన్ఫ్లమేటరీ మార్పులు ఉన్నట్లు వైద్యులు గుర్తించారని చెప్పారు. శస్త్ర చికిత్స అనంతరం రోగికి యాంటీబయోటిక్స్, నొప్పి నివారణ చికిత్స, డయాబెటిస్ నియంత్రణ, ప్రత్యేక పర్యవేక్షణ అందించారన్నారు. ప్రస్తుతం రోగి ఆరోగ్యం మెరుగుపడి స్థిరపడడంతో అవసరమైన సూచనలతో డిశ్చార్జ్ చేసినట్లు ఆయన తెలిపారు. అపెండిక్స్ లేదా పెద్ద ప్రేగుకు సంబంధించిన క్యాన్సర్ తో కూడిన అపెండిక్యూలర్ మాస్ అనేది క్లిష్టమైన ఉదర సంబంధిత వ్యాధి అని, కడుపునొప్పి, జ్వరం, కడుపులో గడ్డ, జీర్ణ సమస్యల వంటి లక్షణాలతో ఇది కనిపిస్తుందని ఆయన పేర్కొన్నారు. సమయానికి గుర్తించకపోతే ఇన్ఫెక్షన్ వ్యాప్తి, ప్రేగు అవరోధం, క్యాన్సర్ ముదిరే ప్రమాదం ఉంటుందని, ముందస్తు నిర్ధారణ, అత్యధునిక పరీక్షలు, సకాలంలో శస్త్ర చికిత్స అత్యంత కీలకమని చెప్పారు. అపెండిక్యులర్ మాస్తో కూడిన కొలస్ క్యాన్సర్ను ప్రారంభ దశలో గుర్తించడం, అత్యాధునిక లాపరో స్కోపిక్ పరీక్షలు, బయాప్సీ కి ద్వారా ఖచ్చితమైన నిర్ధారణ చేయవచ్చన్నారు. క్లిష్టమైన కోలస్ క్యాన్సర్ కు విజయవంతమైన శస్త్ర చికిత్స నిర్వహణ, జీర్ణాశయ క్యాన్సర్కు మల్టీడిసిప్లినరీ వైద్య విధానానికి ప్రాముఖ్యత ఉంటుందని చెప్పారు. కడుపునొప్పి, జ్వరం, కడుపులో గడ్డ వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా ముందస్తు పరీక్షలు అవసరమని అన్నారు. అత్యాధునిక గ్యాస్ట్రోఇంటెస్టినల్, సర్జికల్ ఆంకాలజీ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ కేసు మలక్పేట యశోద సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న అత్యాధునిక గ్యాస్ట్రో ఇంటిస్టీనల్ సర్జరీ, సర్జికల్ అంకిలజీ సేవలు, సమగ్ర వైద్య సదుపాయాలను మరోసారి ప్రతిభంబించిందని అన్నారు. అపెండిక్యులర్ మాస్తో కూడిన కొలస్ క్యాన్సర్ వంటి క్లిష్టమైన ఉదర సంబంధిత వ్యాధులను ప్రారంభ దశలోనే ఖచ్చితంగా నిర్ధారించి అత్యాదునిక లాపరోస్కోపిక్, ఆంకాలజీ శస్త్ర చికిత్సల ద్వారా విజయవంతంగా చికిత్స అందించడం ఆసుపత్రి నైపుణ్యాన్ని చాటిచెప్పిందని తెలిపారు. అత్యాధునిక సాంకేతికత, అనుభవజ్ఞులైన వైద్య బృందం, మల్టీ డిసిప్లినరీ వైద్య విధానాలతో క్లిష్టమైన క్యాన్సర్, జీర్ణాశయ సంబంధిత వ్యాధులకు కూడా సమర్థవంతమైన చికిత్స అందించగల సామర్థ్యం తమ ఆసుపత్రికి ఉందని ఆసుపత్రి డైరెక్టర్ గోరుకంటి పవన్, యూనిట్ హెడ్ కే.శ్రీనివాస్ రెడ్డి, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ చిదుర లు తెలిపారు. అత్యున్నత ప్రమాణాలతో సురక్షితమైన, నాణ్యమైన, సమయోచిత వైద్య సేవలను అందించడంలో తాము ఎల్లప్పుడూ కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి డీజీఎం లక్ష్మణా శ్రీకాంత్,ఏ.వాసు కిరణ్ రెడ్డి ఉన్నారు.

# ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తాం

## తాగునీటి సమస్య పరిష్కారంనికి, ఇరిగేషన్ పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి -వనపర్తి శాసనసభలు తోడి మేఘారెడ్డి





**వనపర్తి, సమయం ప్రతినిధి:** వనపర్తి జిల్లాలో ప్రతి ఎకరాకు సాగు నీరు, తాగు నీటి సమస్య తీర్చడానికి అవసరమైన ఇరిగేషన్ పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని వనపర్తి శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఉమ్మడి పాలమూరు జిల్లా సందర్శించి సాగు, తాగునీటి ప్రాజెక్టు పనుల పురోగతిపై సమీక్షించనున్న నేపథ్యంలో వనపర్తి జిల్లాలో ప్రతి ఎకరాకు సాగు నీరు, భవిష్యత్తులో సైతం తాగు నీటి ఇబ్బందులు రాకుండా ఉండేందుకు అవసరమైన ఇరిగేషన్ పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాల్సిందిగా వనపర్తి శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి సూచించారు. మంగళవారం రాష్ట్ర ఆబ్కారీ, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధ్యక్షతన పాలమూరు రంగారెడ్డి, మహాత్మగాంధీ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనుల పురోగతి, ఇంకా మిగిలి ఉన్న పెండింగ్ పనుల పై నాగర్ కర్నూల్ జిల్లలా వట్టెం రిజర్వాయర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఇరిగేషన్ అధికారులతో కలిసి పాల్గొన్నారు. రాష్ట్ర మంత్రి ద్వారా ఏర్పాటు చేసిన ఉమ్మడి పాలమూరు జిల్లాల ఇరిగేషన్ సమీక్షలో శాసన సభ్యులు మాట్లాడుతూ ఇటీవలే గణప సముద్రం భూసేకరణ, కొంకాలపల్లి, బొంకలపల్లి, బంద్రాయిపాకుల గ్రామాల పునరావాస కేంద్రాలకు సంబంధించిన పరిహారం చెల్లించడం జరిగిందని తెలిపారు. ప్యాకేజీ 27 కింద ఇంకా మిగిలి ఉన్న 68.12 ఎకరాలు భూసేకరణ చేయాల్సి ఉందని, అది త్వరగా పూర్తి అయ్యేవిధంగా చూడాలన్నారు. కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ ప్యాకేజీ 29 కింద డి-5 ను మరింత బలోపేతం చేసి సామర్థ్యం పెంచేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. బుద్ధారం స్టేజ్ 1, 2 కింద డి -5, డి8 కాలువలు వెడల్పు చేయడంతో పాటు మరింత సామర్థ్యం పెంచేందుకు అవసరమైన పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ప్యాకేజ్ - 27 కానయపల్లి వద్ద కాంట్రాక్టర్ పనులు దక్కించుకొని ఇప్పటివరకు పూర్తి చేయలేదని, 60- సి కింద నోటీసులు ఇచ్చి మరో కాంట్రాక్టర్ ద్వారా పనులు పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులను సూచించారు. 14.600 కి.మీల మేర బుద్ధారం కుడికాలువ విస్తరించి సామర్థ్యం పెంచేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించాల్సిందిగా సూచించారు. గట్లఖానాపూర్ రిజర్వాయర్ పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. బుద్ధారం - 2 రిజర్వాయర్ పనులకు ప్రతిపాదనలు, గొల్లపల్లి రిజర్వాయర్, ప్యాకేజీ 28 కింద తాడిపర్తి చెరువు అదనపు పనులు, ఘనపూర్ బ్రాంచి కెనాల్ , కర్నె తాండా లిఫ్ట్ ఇరిగేషన్, రంగ సముద్రం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పనులు, రాజీవ్ భీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ - 2 ఏనుకుంట రిజర్వాయర్ నుండి రంగ సముద్రం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ వరకు మెయిన్ కెనాల్ వెడల్పు పనుల మంజూరుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ప్యాకేజ్ 19 వద్ద పైపులు పాడైపోయాయని, వాటిని మార్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. పెబ్బేరు చెరువు సామర్థ్యం 5 టి.యం.సిలకు పెంచేందుకు అవసరమైన నిధుల ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాల్సిందిగా ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. నాగర్ కర్నూల్ శాసన సభ్యులు రాజేష్‌రెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, ఇరిగేషన్ ఎస్.ఈ చంద్రశేఖర్, పార్థసారథి, కార్యనిర్వహక ఇంజనీర్లు అమర్ సింగ్, రవీందర్, శ్రీనివాస్, వనపర్తి ఆర్డీఓ సుబ్రమణ్యం, కొల్లాపూర్ ఆర్డీఓ బన్సిలాల్ తదితరులు మంత్రి వెంట ఉన్నారు.

# డీకే అరుణకు పార్టీ పగ్గాలు..



**మహబూబ్‌నగర్, (సమయం ప్రతినిధి):** తెలంగాణాలో అధికారంలోకి రావాలని బీజేపీ భావిస్తోంది. 2028 ఎన్నికల్లో గెలిచి తీరాలని పట్టుదలగా ఉంది దాంతో సామాజిక రాజకీయ వ్యూహాలను అమలు చేస్తోంది. రెడ్డి జనాభా అధికంగా ఉన్న తెలంగాణా రాజకీయంగా వారి ప్రభావాన్ని గమనించి ఆ దిశగా వేగంగా పావులు కదుపుతోంది. కేంద్ర మంత్రి వర్గ విస్తరణతో పాటే తెలంగాణలో కొత్త బీజేపీ అధ్యక్షుడి ని కూడా నియమించాలని చూస్తోంది. ప్రస్తుతం తెలంగాణా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న రామచంద్రరావుని తప్పిస్తారని అంటున్నారు. దీంతో భారీ మార్పులకే బీజేపీ శ్రీకారం చుడుతోంది అని అంటున్నారు కేంద్ర మంత్రివర్గంలో తెలంగాణా నుంచి ఇద్దరు మంత్రులు ఉన్నారు. వారిలో ఒకరు బండి సంజయ్, ఆయన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా పనిచేస్తున్నారు. మరొకరు కేబినెట్ ర్యాంక్ మంత్రిగా ఉన్నారు. ఆయనే కిషన్ రెడ్డి. అయితే ఇందులో బండిని తప్పిస్తారు అన్న ప్రచారం అయితే ఊపందుకుంది. ఆయన ప్లేస్ లో కొత్తగా ఒకరిని తీసుకోవాలని చూస్తున్నారు. నిజామాబాద్ కి చెందిన ధర్మపురి అరవింద్ కి కేంద్ర మంత్రిగా చాన్స్ దక్కుతుందని అంటున్నారు. బండి సామాజిక వర్గానికి చెందిన వారితోనే ఆ పోస్టుని భర్తీ చేయడం ద్వారా ఆ సామాజిక వర్గానికి న్యాయం చేసినట్లు అవుతుందని లెక్క వేస్తున్నారుట. ఇక బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరి ఒకసారి ఉప ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచి మరోసారి మల్కాజ్ గిరీ నుంచి ఏకంగా ఎంపీగా గెలిచిన ఈటెలకు తెలంగాణా రాజకీయాల్లో పాతికేళ్ళకు పైగా అనుభవం ఉంది. కేసీఆర్ మంత్రివర్గంలో ఆయన కీలక మంత్రిత్వ శాఖలు నిర్వహించారు. అలాంటి ఆయనకు బీజేపీలో అయితే పెద్దగా పదవులు దక్కింది లేదు. రాష్ట్ర పగ్గాలు ఇస్తారనుకుంటే అదీ లేదు. దాంతో ఆయన వర్గం ఒకింత అసంతృప్తిగా ఉందని అంటున్నారు. దాంతో ఈటెలకు మంత్రి పదవి ఇస్తారు అని అంటున్నారు. త ద్వారా బీజేపీలోకి వచ్చిన వారికి పార్టీ సమాదరిస్తుంది అన్న సందేశాన్ని పంపిస్తారు అని అంటున్నారు. ఇక కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి విషయంలో కూడా కీలక నిర్ణయం తీసుకోబోతున్నారు అని అంటున్నారు. ఆయన శాఖను మారుస్తారు అని అంటున్నారు. కేబినెట్ ర్యాంక్ తో ఆయనకు మరో ముఖ్య శాఖను అప్పగిస్తారు అని అంటున్నారు ఇక కేంద్ర మంత్రి పదవి కోసం పోటీ పడుతున్న మహబూబ్ నగర్ ఎంపీ సీనియర్ నాయకురాలు అయిన డీకే అరుణకు కూడా సమ ప్రాధాన్యత ఇస్తారని అంటున్నారు. ఆమెని తెలంగాణా బీజేపీ ప్రెసిడెంట్ గా తీసుకుంటారు అని అంటున్నారు. తద్వారా ఆమె దూకుడు రాజకీయంతో పార్టీని మరింతగా బలోపేతం చేసుకోవచ్చు అన్నది కమలనాధుల ఆలోచనగా చెబుతున్నారు ఇక డీకే అరుణ చూస్తే ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన వారు. రేవంత్ రెడ్డి సొంత జిల్లాకు చెందిన ఆమె ఢీ అంటే ఢీ అంటూ రేవంత్ రెడ్డితో ఇప్పటికే పోటీ పడుతున్నారు. ఆమెకు కనుక కీలకమైన తెలంగాణా బీజేపీ అధ్యక్ష పీఠం అప్పగిస్తే పార్టీ పరుగులు తీస్తుందని రేవంత్ రెడ్డి కి సరైన ప్రత్యర్థిని ఎంపిక చేసినట్లు అవుతుందని బలమైన రెడ్డి సామాజిక వర్గాన్ని కూడా తమ వైపునకు తిప్పుకున్నట్లు అవుతుందని అంటున్నారు. మొత్తానికి తెలంగాణాలో బీజేపీ ప్రక్షాళనకు కేంద్ర పెద్దలు నిర్ణయించారు అని అంటున్నారు ఈ మేరకు రాష్ట్ర పార్టీ నేతలను పిలిపించుకుని మరీ చర్చిస్తున్నారు అని అంటున్నారు.

# రైతులు అపోహాలు, వదంతులు నమ్మవద్దు

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**సమయం ప్రతినిధి, మంచిర్యాల :** వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో జిల్లాలోని కొన్ని ప్రాంతాలలో రాజకీయ ప్రేరేపిత వ్యక్తులు అసత్య ఆరోపణలతో కలిగించే అపోహాలు, వదంతులను రైతులు నమ్మవద్దని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను జిల్లా అధికార యంత్రాంగం అత్యంత ప్రాధాన్యతతో నిర్వహిస్తుందని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతరం పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో లారీల కొరత, కొనుగోళ్ళలో పూర్తిస్థాయి నిలిచిపోయిన పరిస్థితి లేదని, అవసరానికి అనుగుణంగా లారీలు, హమాలీలు, గోనె సంచులు అందుబాటులో ఉంచడం జరుగుతుందని తెలిపారు. ప్రతి సంవత్సరం జిల్లాలో దాదాపు 1 లక్ష 50 వేల నుండి 1 లక్ష 80 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుండగా ఈ సంవత్సరం ఇప్పటి వరకు 1 లక్ష 5 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని, మిగిలిన ధాన్యం కొనుగోలు, రవాణా ప్రక్రియను 10 నుండి 12 రోజులలో పూర్తి చేసేందుకు ప్రత్యేక కార్యచరణతో ముందుకు వెళుతున్నామని, గతంతో పోలిస్తే ఈసారి కొనుగోలు, రవాణా ప్రక్రియ వేగంగా కొనసాగుతుందని తెలిపారు. రైతుల సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ, పౌరసరఫరాలు, ఎస్.డబ్ల్యూ.సి. శాఖల అధికారులు నిరంతరం ధాన్యం కొనుగోలు కేంద్రాలను పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. రైతుల సంక్షేమానికి జిల్లా అధికార యంత్రాంగం కట్టుబడి ఉందని, రాజకీయ ప్రయోజనాల కోసం తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని రైతులను కోరారు.

## వాహన్ తిప్పలు.. దళారుల రాజ్యం

హైదరాబాద్ : 'రవాణా శాఖ కార్యాలయాల చుట్టూ తిరిగే పని లేకుండా డిజిటల్ సేవలను సులభతరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కేంద్రీకృత 'వాహన్' పోర్టల్ వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు తెచ్చిపెడుతోంది. సాంకేతిక సమస్యల కారణంగా ఆన్‌లైన్ సేవలు సకాలంలో అందకపోవడంతో సామాన్యులు విసిగిపోతున్నారు. ఇదే తరుణాన్ని ఆసరాగా చేసుకుని దళారులు (ఏజెంట్లు) వేలల్లో డబ్బులు తీసుకుంటూ సామాన్యులను దోచుకుంటున్నారు.లర్నింగ్ లైసెన్స్ (ఒఒఫీ), డ్రైవింగ్ లైసెన్స్ పునరుద్ధరణ (రెక్టిఫికేషన్/రిన్యూవల్), చిరునామా మార్పు, డూప్లికేట్ లైసెన్స్ వంటి విభిన్న రకాల సేవల కోసం దేశవ్యాప్తంగా ఒకే విధానం ఉండేలా ఈ పోర్టల్ ను రూపొందించారు. రాష్ట్ర రవాణా శాఖ ఇటీవల ఈ విధానంలోకి మారినప్పటికీ, అప్పటి నుంచి సాంకేతిక లోపాలు నిత్యకృత్యంగా మారాయి.గతంలో నిమిషాల్లో పూర్తయ్యే డ్రైవింగ్ టెస్ట్ స్లాట్ బుకింగ్ ప్రక్రియ, ఇప్పుడు అరగంట దాటినా కావడం లేదు. ఎల్‌ఎల్‌ఆర్ దరఖాస్తుకు మొబైల్ నంబర్ ఆథెంటికేషన్ కావడం లేదు. సరైన సైజులో ఫోటోలు, సంతకం, ఇతర ధ్రువపత్రాలను అప్‌లోడ్ చేసినప్పటికీ వెబ్‌సైట్‌లో లోపాలు తలెత్తుతున్నాయి.సొంతంగా ఆన్‌లైన్ లో దరఖాస్తు చేసుకునేందుకు ప్రయత్నిస్తే వెబ్‌సైట్ పనిచేయకపోవడం, అదే రవాణా కార్యాలయాల్లోని ఏజెంట్లను ఆశ్రయిస్తే వెంటనే స్లాట్ బుకింగ్ అయిపోతుండటం గమనార్హం. వెబ్‌సైట్‌లో ప్రతి సేవకు ఒక నిర్దిష్టమైన ప్రభుత్వ రుసుము ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం దళారులు చెప్పిందే వేదంగా మారుతోంది.

# జీడిమెట్లలో రియల్ బూమ్

హైదరాబాద్ : హైదరాబాద్ మహనగరంలో జీడిమెట్ల పేరు వింటే వెంటనే గుర్తొచ్చేది అతిపెద్ద పారిశ్రామిక ప్రాంతం. ప్రత్యక్షంగా వేలాది మందికి, పరోక్షంగా లక్షలాది మందికి జీవనాధారం. ఇక్కడ పరిశ్రమల్లో పని చేసేందుకు తెలుగు రాష్ట్రాలతో పోటీగా బిహార్, మహారాష్ట్ర వంటి ఇతర రాష్ట్రాల కార్మికులు వలస వచ్చి ఇక్కడే స్థిరపడ్డారు. ఓసారి ఈ కాలనీపై ఓ లుక్కేయండి... భారీ పరిశ్రమల మధ్యలో దాగున్న జీడిమెట్ల కాలనీలకు వెళితే ప్రశాంతమైన పల్లెటూరికి వచ్చామా అనేలా ఆహ్లాదకరమైన అనుభూతి కలుగుతుంది. ఇక్కడ కాలనీల చుట్టూ పరిశ్రమల పొగ, కలుషితమైన నీరు.. ఇదంతా ఒకప్పటి మాట. ఇప్పుడు జీడిమెట్ల అంటే హైదరాబాద్ రియల్ రంగంలో మెరుపు వేగంతో దూసుకుపోతున్న కీలక ప్రాంతం. అందుకే గతంలో వద్దు బాబోయ్ మాకు జీడిమెట్ల జాగా అన్నవాళ్లు.. ఇప్పుడు కొనగలమా ఇక్కడ జాగా అంటూ నోరెళ్లబెడుతున్నారు.ఇక్కడ సొంతిల్లు 10 లక్షల నుండి ఇప్పుడు కోటిన్నరకు పైగా చేరుకుంది. ఇక్కడ అపార్ట్మెంట్ కల్చర్ ఊహించని స్థాయిలో పెరిగిపోయింది. సొంత ఇళ్లు కంటే ఫ్లాట్లు కట్టి అమ్మేస్తున్నారు. కాలుష్యం గతంతో పోల్చితే బాగా తగ్గింది. తాగునీటి సమస్యకు విముక్తి కలిగింది. మంజీరా వాటర్ ప్రతీ ఇంటికీ చేరుతోంది. అపార్ట్మెంట్ లో డబుల్ బెడ్ రూమ్ ఫ్లాట్ కొనాలంటే జీడిమెట్ల కాలనీలలో ఇప్పుడు 50 లక్షల నుండి 60 లక్షల మధ్య ధర పలుకుతోంది.హైదరాబాద్ లో ప్రైమ్ ఏరియా కూకట్ పల్లికి కూతవేటు దూరంలో ఉన్న జీడిమెట్ల పారిశ్రామిక ప్రాంతంలో, పరిశ్రమలు దాటుకుని లోపల కాలనీలలోకి వెళితే భాగ్యనగరంలో ఓ కొత్త ప్రపంచాన్ని చూసినట్లుటుంది. గత పదేళ్ల కాలంలో జీడిమెట్ల కాలనీలు అత్యంత వేగంగా అభివృద్ధి చెందాయి. ముఖ్యంగా దశాబ్దాల నుండి వెంటాడుతున్న త్రాగునీరు, పారిశుధ్యం, కాలుష్యం వంటి సమస్యలకు పరిష్కారం లభించింది. ఈ ప్రభావంతో రియల్ ధరలు విపరీతంగా పెరిగాయి. గజం 20వేల నుండి ఏకంగా 75 వేలు, కొన్నిచోట్ల లక్షకు పైగా ధర పలుకుతోంది. అంటే ఓ 10 గజాలు జాగా కొనాలంటే ఇప్పుడు 75 లక్షలకు పైమాటే.తాజాగా ధరలు ఏ మాత్రం తగ్గలేదు కానీ హైదరాబాద్ వ్యాప్తంగా రియల్ రంగం మందకొడిగా ఉండటంతో కొనుగోళ్లు, అమ్మకాలపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. నిర్మాణ వ్యయం కూడా ఇటీవల కాలంలో విపరీతంగా పెరిగిపోయింది. ఇళ్లు కట్టాలంటే ఒకప్పటి లెక్కలు పూర్తిగా మారిపోయాయి. ధరలు అమాంతం పెరగడంతో ఆ ప్రభావం కొనుగోళ్లు , అమ్మకాలు ఉపాధి అవకాశాలపై స్పష్టంగా కనిపిస్తుంది. బయట నుండి చూస్తున్నవారికి జీడిమెట్ల అంటే విపరీతమైన వాయుకాలుష్యం, భూగర్భ జలాలు పూర్తిగా కలుషితం, అక్కడ ఉండలేమనే అభిప్రాయం ఉంటుంది. కానీ జీడిమెట్ల కాలనీలకు వస్తే ఇక్కడ పూర్తిగా రివర్స్ లో ఇక్కడ ప్రశాంతమైన వాతావారణం కనిపిస్తుంది. పచ్చటి చెట్ల మధ్యలో ఇళ్లు, వాహనాల రద్దీ, ధ్వని కాలుష్యం , ఇవేవీ కనిపించవు, వినిపించవు. అచ్చమైన పల్లెటూరి వాతావరణం ఇక్కడ స్పష్టంగా కనిపిస్తుంది.పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు, ఉపాధి కూలీలు, వారిని నమ్ముకుని నడుస్తున్న కిరాణ వ్యాపారాలు, చిన్న చిన్న హోటల్స్ ఇలా జీడిమెట్ల కాలనీలు హైదరాబాద్ మహానగరం మధ్యలో ఉన్న ఆహ్లాదకర ప్రాంతాలుగా చెప్పవచ్చు. హైదరాబాద్ మహానగరంలో ఓ ప్రాంతం నుండి మరో ప్రాంతానికి కనెక్టివిటీ ఖచ్చితంగా ఉంటుంది. కానీ ఈ విషయంలో జీడిమెట్ల కాలనీలలో వింత పరిస్థితి కనిపిస్తుంది. పారిశ్రామిక వాడమీదుగా జీడిమెట్ల కాలనీలలోకి ఎంటర్ అయ్యామంటే , అక్కడితో కాలనీ ఎండ్ వరకూ వెళ్లి, మళ్లీ వెళ్లిన దారిలోనే తిరిగి వెనక్కు రావాల్సిందే.




స్పోర్ట్స్ డెస్క్: ఐపీఎల్ 2026 సీజన్ తుది దశకు చేరుకుంది. మరికొన్ని గంటల్లో క్వాలిఫైయర్ పోరు ప్రారంభం కానుంది. ధర్మశాల వేదికగా గుజరాత్ టైటాన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్లు తలపడనున్నాయి. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు నేరుగా ఫైనల్‌కు వెళ్తోంది కాబట్టి.. ఇరు జట్లు తమ సర్వశక్తులూ ఒడ్డడానికి సిద్ధమయ్యాయి. అయితే వర్షం కారణంగాఈ హై-వోల్టేజ్ మ్యాచ్ పూర్తిగా రద్దయ్యే పరిస్థితులు కూడా కనిపిస్తున్నాయని వార్తలు వస్తున్నాయి. నేడు(మంగళవారం) ధర్మశాలలో వర్షం కురిసే అవకాశాలు చాలా ఎక్కువగా ఉన్నాయని వాతావరణ శాఖ తెలిపింది. ముఖ్యంగా పగలు భారీ వర్షం పడే సూచనలు కనిపిస్తున్నాయి. దీనికి తోడు మ్యాచ్ జరిగే సమయంలో కూడా వర్షం పడే అవకాశం ఉందట. అయితే మ్యాచ్ పూర్తిగా రద్దయ్యేంత వాన ప్రభావం ఉండకపోవచ్చని పలువురు అభిప్రాయ పడుతున్నారు. టాస్ పడే సమయానికి వర్షం పడటం వల్ల మ్యాచ్ ప్రారంభం కావడంలో కాస్త ఆలస్యం జరగొచ్చు కానీ, రాత్రి సమయంలో వర్షం కురిసే అవకాశం తక్కువగానే ఉందని సమాచారం.

కొండ ప్రాంతమైన ధర్మశాలలో వాతావరణం ఎప్పుడు ఎలా మారుతుందో ఊహించడం ఎవరికీ సాధ్యం కాదు. అందుకే వాతావరణం అనుకూలించి మ్యాచ్ సజావుగా సాగాలని క్రికెట్ అభిమానులు కోరుకుంటున్నారు. ఒకవేళ సాయంత్రం వర్షం పడి పిచ్‌ను ఎక్కువ సమయం కవర్లతో కప్పి ఉంచాల్సి వస్తే.. అది ఇరు జట్ల వ్యూహాలపై ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసే జట్టుకు ఇబ్బందులు ఎదురుకావచ్చు, ఎందుకంటే ప్రారంభంలో బంతి తక్కువ బౌన్స్ అయ్యే అవకాశం ఉంది. ఇది బౌలర్లకు బాగా కలిసిరానుంది. మొత్తంగా ఈ రసవత్తర పోరులో గుజరాత్ తన ఆధిపత్యాన్ని నిలబెట్టుకుంటుందో, లేక ఆర్సీబీ పుంజుకుని ఫైనల్ బెర్త్ ఖరారు చేసుకుంటుందో చూడాలి.




మొదటి పేజీ తరువాయి

ఇంటర్నెట్ డెస్క్: ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 కీలక దశకు చేరుకుంది. నేటి నుంచి ప్లే ఆఫ్స్ సమరం ప్రారంభం కానుంది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ టైటాన్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్.. ప్లే ఆఫ్స్‌కు చేరుకున్నాయి. నేడు ధర్మశాల వేదికగా ఆర్సీబీ-గుజరాత్ టైటాన్స్ తలపడనున్నాయి. ఇందులో గెలిచిన జట్టు నేరుగా ఫైనల్‌కు చేరుకోనుంది. అయితే ఈ సీజన్ ప్లే ఆఫ్స్‌లో ఓ ఆసక్తికర విషయం ఉంది. ఈ నాలుగు జట్లలో ఏ టీమ్ టైటిల్ గెలిచినా.. దానికి అది రెండో విజయం కానుంది.

18 ఏళ్ల నిరీక్షణ తర్వాత గతేడాది రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఐపీఎల్ విజేతగా నిలిచింది. డిఫెండింగ్ ఛాంపియన్ ఆర్సీబీ.. ఈ సీజన్‌లో ప్రస్తుతం అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఐపీఎల్ 2026లోనూ గెలిస్తే.. ఆ జట్టు రెండోసారి ట్రోఫీని ముద్దాడుతుంది.

గుజరాత్ టైటాన్స్ జట్టు 2022లో ఐపీఎల్ ఛాంపియన్‌గా నిలిచింది. జీటీకి అదే తొలి సీజన్ కావడం విశేషం. హార్దిక్ పాండ్య కెప్టెన్సీలో కప్పును ముద్దాడి గుజరాత్ చరిత్ర సృష్టించింది. ప్రస్తుతం రెండో స్థానంలో ఉన్న జీటీ.. ఈ సీజన్‌లోనూ గెలిస్తే.. అది రెండో టైటిల్ అవుతుంది.

సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు 2016లో ఐపీఎల్ విజేతగా నిలిచింది. డేవిడ్ వార్నర్ కెప్టెన్సీలో కప్పును ముద్దాడింది. ఈ సీజన్‌లో మూడో స్థానంలో ఉన్న ఎస్ఆర్‌హెచ్.. కప్పు గెలిస్తే అది రెండోసారి అవుతుంది.

ఐపీఎల్ ప్రారంభించిన తొలి ఏడాది రాజస్థాన్ రాయల్స్ కప్పు గెలిచింది. 2008లో షేన్ వార్న్ సారథ్యంలో టైటిల్ విన్నర్‌గా నిలిచింది. ఇప్పటి వరకు మళ్లీ కప్పు గెలవలేదు. ప్రస్తుతం నాలుగో స్థానంలో ఉన్న ఆర్ఆర్.. ఈసారి ట్రోఫీ గెలిస్తే అది రెండోసారి అవుతుంది.




ఇంటర్నెట్ డెస్క్: ఐపీఎల్ 2026 క్వాలిఫయర్ 1లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ టైటాన్స్ జట్లు నేడు ధర్మశాల వేదికగా తలపడనున్నాయి. ఈ మ్యాచ్‌లో అందరి దృష్టి ఆర్సీబీ స్టార్ ప్లేయర్ విరాట్ కోహ్లీపైనే ఉంది. జట్టును ఫైనల్‌కు చేర్చడంలో కోహ్లీ పాత్ర కీలకంగా మారనున్న వేళ.. అతడి ప్లే ఆఫ్స్ రికార్డు మాత్రం ఆర్సీబీ అభిమానులను కాస్త కలవరపెడుతోంది. ఈ సీజన్‌లో విరాట్ అద్భుతమైన ఫామ్‌ను కనబరుస్తున్నాడు. 14 మ్యాచుల్లో 557 పరుగులు సాధించాడు. ఇందులో నాలుగు అర్ధ సెంచరీలు, ఒక సెంచరీ ఉంది. లీగ్ స్టేజ్‌లో దూకుడు ప్రదర్శించే కోహ్లీ.. ప్లే ఆఫ్స్‌లో మాత్రం కాస్త తడబడుతూ వస్తున్నాడు. ఐపీఎల్ ప్లే ఆఫ్స్‌లో అతడి గణాంకాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఇప్పటి వరకు 17 ప్లే ఆఫ్స్ మ్యాచ్‌లు ఆడిన కోహ్లీ కేవలం 396 పరుగులే చేశాడు. 26.40 సగటు, 121.10 స్ట్రైక్ రేట్‌తో బ్యాటింగ్ చేశాడు. కోహ్లీ క్రికెట్ కెరీర్‌లోనే ఐపీఎల్ ప్లే ఆఫ్స్‌లో అత్యంత చెత్త రికార్డులు ఉన్నాయి. దీంతో ఈ సీజన్ ప్లే ఆఫ్స్‌లో అయినా కోహ్లీ నుంచి భారీ ఇన్నింగ్స్ వస్తుందా? అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఆ చెత్త రికార్డుకు కోహ్లీ ఈ సీజన్‌లోనైనా చెక్ పెట్టి దూకుడుగా ఆడతాడా? అనేది చూడాల్సి ఉంది. మరోవైపు శుభ్‌మన్ గిల్ సారథ్యంలోని గుజరాత్ టైటాన్స్ జట్టు భీకరమైన ఫామ్‌లో ఉంది. అంచనాలే లేకుండా బరిలోకి దిగి.. ఇప్పుడు టైటిల్ ఫేవరెట్‌గా మారింది. సీజన్ ఆరంభంలో వరుస ఓటములతో తడబడిన జీటీ.. బౌలింగ్ దళంతో చెలరేగి టైటిల్ రేసులో నిలిచింది. కాగా క్వాలిఫయర్ 1లో విజయం సాధించిన జట్టు.. నేరుగా ఫైనల్‌కు చేరుకుంటుంది. ఓడిన జట్టుకు మరొక ఛాన్స్ లభిస్తుందన్న విషయం తెలిసిందే.




స్పోర్ట్స్ డెస్క్: స్టార్ ప్లేయర్లు విరాట్ కోహ్లీ , ట్రావిస్ హెడ్ మధ్య మైదానంలో చెలరేగిన వివాదం రోజురోజుకీ కొత్త మలుపులు తీసుకుంటోంది. సన్ రైజర్స్ హైదరాబాద్‌తో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మ్యాచ్ సందర్భంగా సరదాగా మొదలైన ఈ వివాదం, ఆట ముగిసిన తర్వాత హెడ్‌తో కరచాలనం చేయడానికి కోహ్లీ నిరాకరించడంతో ఒక్కసారిగా ముదిరింది. పలువురు అభిమానులు హెడ్ భార్య జెస్సికాను ఈ వివాదంలోకి లాగి, ఆమెను ట్రోల్ చేయడంతో వివాదం మరింత పెద్దదైంది. కోహ్లీ, హెడ్ వివాదంలో తాజాగా మరో వ్యక్తి చిక్కుకున్నాడు. కొందరు అభిమానులు ఆస్ట్రేలియా క్రికెటర్ ట్రావిస్ హెడ్‌కు అమెరికన్ రాపర్ ట్రావిస్ స్కాట్‌కు మధ్య తేడా తెలియక కన్ఫ్యూజ్ అయ్యారు. దీంతో వాళ్లు పొరపాటున హెడ్ అనుకుని రాపర్ ట్రావిస్ స్కాట్ ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌కు వెళ్లి ఆయన ఫొటోల కింద కోపంతో నెగిటివ్ కామెంట్లు పెట్టడం ప్రారంభించారు. ఆ పోస్టులు సోషల్ మీడియాలో తెగ వైరల్ అయ్యాయి. 'కోహ్లీ, హెడ్ గొడవ పడితే మధ్యలో నేనేం చేశాను' అని ట్రావిస్ స్కాట్ ఫీల్ అవుతున్నట్లు అతడి ఫొటోలు కూడా నెట్టింట వైరల్ అవుతున్నాయి. మరోవైపు హెడ్ సతీమణి జెస్సికా ఈ వేధింపులపై స్పందిస్తూ తన బాధను పంచుకుంది. కోహ్లీకి తన భర్తకు గొడవ జరిగితే మధ్యలో తనను టార్గెట్ చేస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. గతంలో వన్డే ప్రపంచ కప్ 2023 ఫైనల్‌లో రోహిత్ శర్మను ఔట్ చేయడానికి ట్రావిస్ హెడ్ అద్భుతమైన క్యాచ్ పట్టినప్పుడు కూడా జెస్సికా ఇలాంటి దుర్భాషలనే ఎదుర్కొన్నారు. ఇప్పుడు జరుగుతున్న వివాదం ఆమెకు ఆ చేదు జ్ఞాపకాలను మళ్లీ గుర్తుచేసిందని క్రీడా నిపుణులు అభిప్రాయ పడుతున్నారు.




స్పోర్ట్స్ డెస్క్: ఐపీఎల్ 2026 నుంచి ముంబై ఇండియన్స్ ముందుగానే నిష్క్రమించడంతో హార్దిక్ పాండ్య కెప్టెన్సీపై విమర్శలు వ్యక్తమయ్యాయి. వచ్చే సీజన్‌లో ఈ ఆల్‌రౌండర్ జట్టుకు నాయకత్వం వహించకూడదని కొంతమంది క్రీడా నిపుణులు, అభిమానులు సూచిస్తున్నారు. ఈ సీజన్‌లో అతను 8 ఇన్నింగ్స్‌ల్లో కేవలం 146 పరుగులు చేసి.. 3 వికెట్లు మాత్రమే తీశాడు. వచ్చే ఏడాది హార్దిక్ ఎంఐ కెప్టెన్‌గా కొనసాగడం తనకు ఇష్టంలేదంటూ భారత మాజీ బ్యాటర్ వసీం జాఫర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అయితే పాండ్య వ్యక్తిగత ఆటపై దృష్టి పెట్టేందుకు ఫ్రాంచైజీ అతన్ని తప్పకుండా జట్టులో కొనసాగించాలని పేర్కొన్నాడు. జాఫర్ తన యూట్యూబ్ ఛానెల్‌లో మాట్లాడుతూ.. 'నేను అతడిని కెప్టెన్‌గా చేయను, కానీ జట్టులో తప్పకుండా కొనసాగిస్తాను. అతను మరింతగా రాణించి, తనలోని అత్యుత్తమ ప్రతిభను వెలికితీయాలని నేను కోరుకుంటున్నాను' అని అన్నాడు. అలానే హార్దిక్ స్థానంలో కెప్టెన్‌గా ఎవరిని నియమిస్తారని అడగ్గా.. 'ప్రస్తుత పరిస్థితుల్లో కెప్టెన్‌ను ఎంపిక చేయడం కష్టం' అని జాఫర్ సమాధానం ఇచ్చాడు. ఈ సీజన్ తమ చివరి లీగ్ మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ చేతిలో 30 పరుగుల తేడాతో ఓటమి పాలైన ముంబై ఇండియన్స్.. పాయింట్ల పట్టికలో నిరాశాజనకంగా తొమ్మిదో స్థానంతో సరిపెట్టుకుంది. పాయింట్లతో పట్టికలో తొమ్మిదో స్థానంలో నిలిచినప్పటికీ కెప్టెన్ హార్దిక్‌పై ఎటువంటి నిందలు వేయడం జరగదని ముంబై ఇండియన్స్ బ్యాటింగ్ కోచ్ కీరన్ పొలార్డ్ స్పష్టం చేశారు. నాయకత్వ కోణం నుంచి చూస్తే, హార్దిక్ వ్యక్తిగతంగా ఆశించిన స్థాయిలో రాణించలేదని పొలార్డ్ విలేకరులతో అన్నారు. 'యాజమాన్య సిబ్బందిగా మేము కోరుకున్నట్లుగా జరగకపోయి ఉండవచ్చు. ఫ్రాంచైజీకి నాయకత్వం వహించడానికి, అతడు రాణించడానికి మేము అన్ని విధాలుగా ప్రయత్నించాము. ఈ సీజన్‌లో ముంబై ఇండియన్స్ విఫలమనేది.. కేవలం ఏ ఒక్క వ్యక్తి తప్పిదం కాదు. తమ ఫ్రాంచైజీ సామూహిక వైఫల్యం' అని పొలార్డ్ అన్నారు.



## చెన్నై సూపర్ కింగ్స్‌లోకి ఊహించని ప్లేయర్!

స్పోర్ట్స్ డెస్క్: ఐపీఎల్ 2026 సీజన్‌లో ముంబై ఇండియన్స్ జట్టు ప్రదర్శన అభిమానులను తీవ్ర నిరాశకు గురి చేసింది. ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన ముంబై జట్టు ఈ సీజన్ లీగ్ దశలో నిలకడైన ఆటతీరును ప్రదర్శించలేకపోయింది. రాజస్థాన్ రాయల్స్ జట్టుతో జరిగిన తమ చివరి గ్రూప్ మ్యాచ్‌లో కూడా ఓడిపోవడంతో ముంబై జట్టు పాయింట్ల పట్టికలో 9వ స్థానానికి పరిమితమైంది. కెప్టెన్ హార్దిక్ పాండ్యకు కూడా ఈ సీజన్ ఓ పీడకలలా సాగింది. ఈ క్రమంలోనే హార్దిక్‌ను ముంబై జట్టు ట్రేడింగ్ ద్వారా వేరే జట్టుకు పంపించబోతోందనే ప్రచారం క్రీడా వర్గాల్లో జరుగుతోంది. ఈ వార్తలకు బలం చేకూరుస్తూ హార్దిక్ సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ఒక ఫోటో మరింత రచ్చ చేస్తోంది. హార్దిక్ పాండ్య తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో ఒక లాప్‌టాప్, ఒక నోట్‌బుక్, ఒక పెన్ , హార్దిక్ మొబైల్ ఫోన్ ఉన్నా ఫొటోను షేర్ చేశాడు. ఆ ఫొటోలో కనిపించే ఫోన్ డిస్‌ప్లేపై టైమ్ '07:07' అని చూపిస్తోంది. ఈ నంబర్‌ను చూడటమే ఆలస్యం.. నెటిజన్లు దీనికి మిస్టర్ కూల్ మహేంద్ర సింగ్ ధోనీతో లింక్ పెట్టడం ప్రారంభించారు. క్రికెట్ ప్రపంచంలో '7' అనే నంబర్ ధోనీ జెర్సీ నంబర్‌గా ఎంతటి గుర్తింపు తెచ్చుకుందో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. వచ్చే సీజన్‌లో హార్దిక్ పాండ్య ముంబైని వీడి, ధోనీ ఉన్న చెన్నై సూపర్ కింగ్స్ జట్టులోకి మారబోతున్నాడనే హింట్ ఇవ్వడానికే ఈ పోస్ట్ పెట్టాడంటూ కొందరు అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు. అయితే ఈ చర్చలపై హార్దిక్ కానీ, ముంబై యాజమాన్యం కానీ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక స్పందన ఇవ్వలేదు. దీంతో హార్దిక్ గురించే అశూ చెప్పాడనే చర్చ నడుస్తోంది. కాగా పతిరణను గతేడాది సీఎస్కే రిలీజ్ చేయగా.. కోల్‌కతా సొంతం చేసుకుంది.



**వైవిధ్యమైన పాత్రలతో దక్షిణాది సినీ పరిశ్రమలో ప్రత్యేక ముద్రవేసిన స్టార్ హీరోయిన్ జ్యోతిక. తాజాగా బాలీవుడ్ చిత్రం 'సిస్టమ్'తో ఓటీటీ వేదికగా ప్రేక్షకుల ముందుకు వచ్చారు. ఈ ప్రాజెక్ట్ ప్రమోషన్స్ సందర్భంగా ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో తన సినీ ప్రస్థానం, నార్త్-సౌత్ చిత్ర పరిశ్రమల మధ్య ఉన్న పని సంస్కృతి, మహిళా నటుల హక్కుల గురించి ఎంతో ధైర్యంగా మాట్లాడారు. నటిగా తన అంతరంగాన్ని ఆవిష్కరించిన ఆ విశేషాలు ఆమె మాటల్లోనే...**

# సౌత్ నన్ను ఆదరించింది

నా మొదటి హిందీ సినిమా 'డోలీ సజాకే రఖ్నా' బాక్సాఫీసు వద్ద ఘోరంగా ఫ్లాప్ అయినప్పుడు.. బాలీవుడ్ ఇండస్ట్రీ నాకు ఒక్కసారిగా తలుపులు మూసేసింది. మొదటి సినిమాతోనే వైఫల్యాన్ని ఎదుర్కోవడం నన్ను తీవ్ర నిరాశకు గురిచేసింది. బాలీవుడ్ తిరస్కరించిన ఆ సమయంలో సౌత్ పరిశ్రమ నన్ను ఎంతగానో ఆదరించింది. నా మొదటి తమిళ సినిమా ఆశించిన విజయం సాధించకపోయినా అక్కడి మేకర్స్, ప్రేక్షకులు నా వైఫల్యాన్ని చూడలేదు.

## సొంతింటి అమ్మాయిలా గుర్తింపు

సౌత్ మేకర్స్ నాలోని నటిని, నా ప్రతిభను గుర్తించి వరుసగా ఎన్నో అద్భుతమైన అవకాశాలు ఇచ్చారు. నిజం చెప్పాలంటే చెన్నై నగరం, అక్కడి ప్రేక్షకులు నేను ఊహించిన దానికంటే ఎంతో ఎక్కువే ఇచ్చి నన్ను వారి సొంత ఇంటి అమ్మాయిలా గుండెల్లో పెట్టుకున్నారు. ఆ ఆదరణే నన్ను సౌత్‌లో దశాబ్దాలపాటు స్టార్ హీరోయిన్‌గా నిలబెట్టింది. ఆ తర్వాత వివాహం, పిల్లల బాధ్యతల వల్ల నేను సినిమాలకు చాలా కాలంపాటు లాంగ్ బ్రేక్ ఇవ్వాల్సి వచ్చింది. మళ్లీ ఇన్నేళ్ల తర్వాత పూర్తిస్థాయిలో కెమెరా ముందుకు వచ్చినప్పుడు నాలో తెలియని ఒక భయం, చేతుల్లో వణుకు మొదలయ్యాయి.

## సున్నా నుంచి సరికొత్త ప్రయాణం

గతంలో నాకు ఎంత అనుభవం ఉన్నా.. కెరీర్‌ను మళ్లీ మొదటి నుంచి, సున్నా నుంచి ప్రారంభిస్తున్నట్టు అనిపించింది. నటన మాత్రమే కాదు.. సుదీర్ఘ విరామం కారణంగా హిందీ భాషపై పట్టు కోల్పోవడంతో లాంగ్వేజ్ కూడా నాకు పెద్ద సవాలుగా మారింది. అయితే నా ఈ సెకండ్ ఇన్నింగ్స్‌లో బాలీవుడ్‌కు తిరిగి వచ్చాక ఇక్కడ గొప్ప సానుకూల మార్పును గమనించాను. ప్రస్తుతం హిందీ చిత్ర పరిశ్రమలో, ముఖ్యంగా డిజిటల్ యుగంలో ఓటీటీ రంగం విస్తరించిన తర్వాత 40 ఏళ్లు పైబడిన మహిళా నటుల కోసం ఎంతో వైవిధ్యమైన, సవాలుతో కూడిన పవర్‌ఫుల్ పాత్రలు రాస్తున్నారు.

## వయసు హద్దులు చెరిపేసే ఓటీటీ

ఒకప్పుడు హీరోయిన్లకు 30 ఏళ్లు దాటితే కెరీర్ ముగిసిపోయిందనే ముద్ర వేసేవారు. కానీ నేడు ఆ హద్దులు పూర్తిగా చెరిగిపోయాయి. మహిళా ప్రాధాన్యం ఉన్న వైవిధ్యమైన కథలు ఇక్కడ పుట్టుకొస్తున్నాయి. నిజాయతీగా చెప్పాలంటే ఈ విషయంలో సౌత్ ఇండస్ట్రీ ఇంకా ఎంతో మారాల్సి ఉంది. 40 ప్లస్ మహిళల కోణంలో కథలను అన్వేషించడంలో సౌత్ ఇంకా వెనుకబడే ఉంది. నార్త్, సౌత్ పరిశ్రమలు రెండింటిలోనూ ప్లస్‌లు, మైనస్‌లు ఉన్నాయి.

## పనిగంటల వివాదం

ప్రస్తుతం చిత్ర పరిశ్రమలో తీవ్ర చర్చకు దారితీసిన '8 గంటల పనివేళల' అంశంపై నా అభిప్రాయం చాలా స్పష్టం. దీపికా పదుకొణె తన సినిమాల్లో 8 గంటల షిఫ్ట్ అడగడంలో ఎలాంటి తప్పు లేదు. నిజానికి సౌత్ ఇండస్ట్రీలో నేను పనిచేసినప్పుడు ఇలాంటి డిమాండ్‌ను ప్రత్యేకంగా అడగాల్సిన అవసరమే ఎప్పుడూ రాలేదు. ఎందుకంటే అక్కడ 99 శాతం సినిమాల షూటింగ్స్ సాయంత్రం 6 గంటలకల్లా ప్యాకప్ అయిపోతాయి. ఉదయం 7 గంటలకో, లేదా 9 గంటలకో షూటింగ్ ప్రారంభించి సాయంత్రం కచ్చితంగా 6 గంటలకు ముగించడం అక్కడ దశాబ్దాలుగా పాటిస్తున్న ఒక ఆరోగ్యకరమైన అలవాటు. కానీ బాలీవుడ్‌లో మాత్రం ఉదయం నుంచి రాత్రి వరకు 12 గంటలపాటు విరామం లేకుండా సుదీర్ఘమైన షిఫ్ట్‌లు నడుస్తుంటాయి. ఇది శారీరకంగా, మానసికంగా ఎంతో అలసటను కలిగిస్తుంది. చిత్ర పరిశ్రమలో ఎంతోమంది స్టార్ హీరోలు 8 గంటల సమయం ముగియగానే.. ఆఖరికి షాట్ పూర్తయిందా లేదా అని కూడా చూడకుండా నేరుగా కారెక్కి వెళ్లిపోతుంటారు. వారిని ఎవరూ ప్రశ్నించరు. వారినెవరూ తప్పుబట్టరు.

## మాపైనే ఎందుకీ వివక్ష?

కెరీర్‌లో ఒక మంచి స్థానానికి చేరుకుని, ఎన్నో ఏళ్లుగా సేవలందిస్తున్న ఒక నటి తన పనిగంటల గురించి, పని-వ్యక్తిగత సమతుల్యత గురించి అడిగితే ఎందుకింత వివాదం చేయాలి? ఎందుకంత వివక్ష చూపాలి? ఒక వ్యక్తిగా, అంతకంటే ముఖ్యంగా ఒక తల్లిగా మహిళలకు ఇలాంటి సమయ పాలన ఎంతో అవసరం. మన సమాజంలో స్త్రీలు కెరీర్ మాత్రమే చూసుకుంటే సరిపోదు.

## పరస్పర సహకారంతోనే విజయం

సూర్య షూటింగ్స్‌లో బిజీగా ఉన్నప్పుడు నేను ఇల్లు, పిల్లల బాధ్యతలు చూసుకుంటాను. నేను షూటింగ్‌ల కోసం ముంబై వచ్చినప్పుడు సూర్య పిల్లల బాధ్యత తీసుకుంటారు. ఈ పరస్పర సహకారం వల్లే మేము వ్యక్తిగత, వృత్తిపరమైన



జీవితాలను విజయవంతంగా సమన్వయం చేసుకోగలు గుతున్నాం.

## ప్రేక్షకుల ముందుకు 'సిస్టమ్'

ఈ సరికొత్త ఆలోచనలు, మారుతున్న సినిమా ధోరణుల మధ్యే నా తాజా చిత్రం 'సిస్టమ్' ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అమెజాన్ ప్రైమ్ వీడియోలో విడుదలైన ఈ సిరీస్ ఒక ఇంటెన్స్ కోర్ట్ రూమ్ డ్రామా. ఇందులో నేను సమాజంలో ఎలాంటి ఆర్థిక వనరులు, బ్యాక్ గౌండ్ లేని ఒక సాధారణ కోర్టు స్టెనోగ్రాఫర్ పాత్రను పోషించాను. సోనాక్షి సిన్హా పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా, ప్రముఖ దర్శకుడు అశుతోష్ గోవారికర్ డిఫెన్స్ లాయర్‌గా కీలక పాత్రలో నటించారు. ప్రసిద్ధ దర్శకురాలు అశ్విని అయ్యర్ తివారీ ఈ చిత్రాన్ని అద్భుతంగా, ఎంతో సహజంగా తెరకెక్కించారు. ఒక దర్శకురాలి సెట్స్‌లో పనిచేయడం ఎంతో సౌకర్యంగా ఉంటుంది. కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా సమాజంలో మహిళల వాణిని బలంగా వినిపించే ఇలాంటి కథలు, పాత్రలు మరిన్ని రావాల్సిన అవసరం ఉంది.

## దీపిక నిర్ణయం సరైనదే

షూటింగ్ ముగించుకుని ఇంటికి వెళ్లిన తర్వాత పిల్లలను చూసుకోవాల్సిన బాధ్యత, వారి చదువులు, ఎదుగుదలలో భాగం పంచుకోవాల్సిన అవసరం తల్లులకు ఉంటుంది. దీపిక ఇటీవల ఒక బిడ్డకు జన్మనిచ్చింది. ఒక తల్లిగా ఆ పాపను క్షేమంగా పెంచాల్సిన బాధ్యత ఇప్పుడు ఆమెపై ఉంది. కాబట్టి ఆమెకు 8 గంటల షిఫ్ట్ కచ్చితంగా అవసరం. ఒక తల్లిగా ఆమె దానికి పూర్తిగా అర్హురాలు. శ్రమ అనేది ఎప్పుడూ శరీరానికి, మనసుకు హాని కలిగించేలా ఉండకూడదు. పనికి, వ్యక్తిగత జీవితానికి మధ్య సమతుల్యత ఉన్నప్పుడే ఎవరైనా తమ వృత్తిలో ప్రతిభ కనబరచగలరు. నా వ్యక్తిగత జీవితంలో కూడా నా భర్త సూర్య, నేను ఇదే బ్యాలెన్స్ పాటిస్తాం. మా కుటుంబంలో ఒకరి నిర్ణయాలను, కెరీర్‌ను మరొకరం ఎంతో గౌరవించుకుంటాం.

---



# ఆసనంలో అవస్థలు

ఆరోగ్య సమస్యలకు కచ్చితమైన, సమర్థమైన వైద్యం అందాలంటే, సదరు సమస్యలకు తగిన వైద్యులనే ఎంచుకోవాలి. మరీ ముఖ్యంగా మలద్వారంతో ముడిపడి ఉండే సమస్యలకు 'ప్రొక్టాలజిస్ట్'నే ఎంచుకోవాలి. సమస్య మూల కారణాన్ని గుర్తించి, దాన్ని కూకటివేర్లతో పెకిలించే సామర్థ్యం ఈ వైద్యులకు మాత్రమే ఉంటుందనీ, పైల్స్, ఫిషర్స్ మొదలైన రుగ్మతలకు మెరుగైన చికిత్సలు అందుబాటులో ఉన్నాయనీ ప్రముఖ ప్రొక్టాలజిస్ట్, డాక్టర్ శాంతివర్ధని వివరిస్తున్నారు

నోటి ద్వారా తింటాం, మలద్వారం ద్వారా విసర్జిస్తాం. తినడానికి నోరు ఎంత కీలకమో, విసర్జనకు మలద్వారం కూడా అంతే ముఖ్యం కాబట్టి నోరును ఎంత శుభ్రంగా ఉంచుకుంటామో, మలద్వారాన్ని కూడా అంతే పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఈ ప్రదేశం ఎంతో సున్నితమైనది, సంక్లిష్టమైనది. మల పరిమాణాన్ని బట్టి రబ్బరు బ్యాండులా సాగుతూ, మూసుకుపోతూ ఉండే అద్భుతమైన యంత్రాంగాన్ని కలిగిన మలద్వారం, ఎక్కువగా నిర్లక్ష్యానికి గురవుతూ ఉంటుంది. దాంతో పైల్స్, ఫిషర్స్ లాంటి సమస్యలు వేధించడం మొదలుపెడతాయి. ఈ సమస్యల కారణాలు, పరిష్కారాల గురించి తెలుసుకుందాం!

## మొలలతో ముప్పు

శరీరంలో తయారయ్యే వ్యర్థం ఎప్పటికప్పుడు బయటకు వెళ్లిపోతూ ఉండాలి. అందుకే రోజంతా పేగుల్లో పేరుకుపోయిన వ్యర్థమంతా, ఉదయం నిద్ర లేవగానే కాలకృత్యాల రూపంలో బయటకొచ్చేస్తూ ఉంటుంది. అయితే ఈ విసర్జన ప్రక్రియ సహజసిద్ధంగా జరిగినప్పుడు, ఆ రోజంతా ఎలాంటి చీకూ చింతా లేకుండా గడిచిపోతుంది. ఇలా ఉదయాన్నే సుఖవిరోచనం జరగనప్పుడు ముక్కడం మొదలుపెడతారు. విరోచనమయ్యే సూచనలు లేకున్నా, ఎక్కువసేపు కూర్చుంచిపోతారు. దాంతో లోపలున్న పైల్స్, స్పాంజి బంతుల్లా నెమ్మదిగా బయటకు తోసుకురావడం మొదలుపెడతాయి. ఈ పరిస్థితిలో ప్రెజర్‌తో మలాన్ని విసర్జించే ప్రయత్నం చేసినప్పుడు, మొలలు పగిలిపోతాయి. దాంతో రక్తస్రావం మొదలవుతుంది. బయటకు ఉబ్బినట్టుండే మొలలున్న వాళ్లలో రక్తస్రావం కనిపించకపోవచ్చు. ఇలాంటి మొలల విషయంలో వాటి నుంచి రక్తం బయటకు కారకపోయినా, లోపలే గూడుకట్టుకుపోతుంది. అంతర్గత మొలలతో నొప్పి లేకపోయినా, రక్తస్రావం ఉంటుంది. కానీ బహిర్గత మొలలు రక్తస్రావం లేకపోయినా, నొప్పితో వేధిస్తాయి.

## చికిత్స కీలకం

బహిర్గత మొలలను మందులతో తగ్గించగలిగితే రోగికి ఉపశమనం కలుగుతుంది. కానీ రక్తస్రావం అవుతున్న అంతర్గత మొలలకు లేజర్‌తో, స్టాప్లర్‌తో లేదా ఇంజెక్షన్లతో చికిత్స చేయొచ్చు. అయితే పూర్వం మొలలను కత్తిరించి, కుట్టు వేసేవారు. ఇలా చేయడం వల్ల మలద్వారం వదులైపోయి, మలవిసర్జన మీద నియంత్రణ కోల్పోయే ప్రమాదం ఉంటూ ఉండేది. దాంతో ప్రత్యామ్నాయంగా కొందరు నాటువైద్యులను ఆశ్రయిస్తూ ఉంటారు. మొలలను కత్తిరించకుండా, మలవిసర్జన మీద నియంత్రణ కోల్పోకుండా, మలద్వారం వదులవకుండా, మొలలను వాటి వాటి స్థానాలకు చేర్చే సమర్థమైన చికిత్సలు ఇప్పుడు అందుబాటులోకొచ్చాయి. 20% మేర మలవిసర్జన నియంత్రణ, మొలల మీదే ఆధారపడి ఉంటుంది. కాబట్టి వాటిని తొలగించని చికిత్సలను అందించే, సంబంధిత రంగంలో శిక్షణ పొందిన ప్రొక్టాలజిస్టులనే ఆశ్రయించాలి.

## ఫిషర్స్‌తో అసౌకర్యం

నోట్లో ఉండే మ్యూకోసా, మలద్వారం లోపల ఉండే మ్యూకోసా ఒకటే! కాబట్టి నాలుక, పెదవుల లోపల, బుగ్గల్లో పుండ్లు ఎంతగా బాధిస్తాయో, మలద్వారం లోపల తలెత్తే ఫిషర్స్ కూడా అంతే వేధిస్తాయి. ఈ సమస్య విపరీతంగా బాధిస్తుంది కాబట్టి మలవిసర్జనే మానేస్తూ ఉంటారు. దాంతో మలబద్ధకం పెరిగి, ముక్కడం మొదలుపెడతారు. దాంతో మ్యూకోజా చీరుకుపోయి, మంట, నొప్పి వేధిస్తాయి. ఆ సమయంలో కొందరు, నొప్పి తగ్గించే మందులు, సుఖవిరోచన మందులు వాడుకుంటూ తాత్సారం చేస్తూ ఉంటారు. ఫలితంగా అది మానని పుండులా మారిపోయి, దాన్లో మలం పేరుకుపోతూ, ఆ ప్రదేశం మరింత కుళ్లిపోయి సమస్య మరింత జటిలమవుతుంది. సుదీర్ఘ ప్రయాణాలు చేసినప్పుడు, ఆ ప్రదేశంలో ఎక్కువ చమట పట్టినప్పుడు, మధుమేహం బారిన పడ్డప్పుడు... ఆ ఫిషర్ మరింత లోపలకు తొలుచుకుంటూ వెళ్లిపోయి, మలద్వారం పరిసరాల్లో పుండులా, గడ్డలా బహిర్గతమవడం మొదలుపెడుతుంది.

## ఫిస్టులా బాధలు

మల ద్వారం దగ్గర తలెత్తే సెగ్గడ్డలను పోలిన సమస్య ఇది. వీటిని చూసి, వేడి చేసి సెగ్గడ్డ వచ్చిందని అనుకుంటూ ఉంటారు. వీటికి కొందరు గవద పట్టీలు అంటిస్తే, ఇంకొందరు వేడి కాపడం పెట్టడం, స్వయంగా యాంటీబయాటిక్స్ కొని వాడేయడం చేస్తూ ఉంటారు. కానీ మలద్వారం పరిసరాల్లో ఎలాంటి పుండు, సెగ్గడ్డ వచ్చినా, దాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలి. ప్రారంభంలో గడ్డ లేదా పుండులా కనిపించినా, ఆ తర్వాత దానికి రంధ్రం ఏర్పడి చీము కారడం మొదలుపెడుతుంది. అయితే ఈ ఫిస్టులా వేరు, మల ద్వారం లోపల ఉంటే, దాని కొమ్మలు మలద్వారం పరిసరాల్లో పుండ్ల రూపంలో బయటకు కనిపిస్తాయి. ఈ సమస్యను సమూలంగా నిర్మూలించడం కోసం, కొమ్మలను కత్తిరించడానికి బదులుగా, వేరును పెకిలించాల్సి ఉంటుంది. ఫిస్టులా చికిత్సలో ఏ చిన్న పొరపాటు జరిగినా, మలవిసర్జన మీద నియంత్రణ కోల్పోయే ప్రమాదం ఉంటుంది. ఫిస్టులా తిరగబెట్టినా ఫర్వాలేదు. దాన్ని చికిత్సతో సరిచేసుకోవచ్చు. కానీ స్ఫింక్టర్లు దెబ్బతిని మలవిసర్జన మీద నియంత్రణ కోల్పోతే, ఆ సమస్యను సరిదిద్దడం కష్టం. కాబట్టి ఫిస్టులా చికిత్సలో భాగంగా మలవిసర్జన నియంత్రణకు తోడ్పడే స్ఫింక్టర్లను చెక్కుచెదరనివ్వని ప్రొక్టాలజిస్టులనే ఆశ్రయించాలి.

## Cinema




ఎన్టీఆర్‌కు పాన్ ఇండియా స్థాయిలో క్రేజ్ ఉంది. కెరీర్ బిగినింగ్ నుంచీ పౌరాణిక, జానపద, సాంఘిక పాత్రలు ప్రేక్షకుల్ని మెప్పిస్తున్నారు. ఆయన డైలాగ్ డెలివరీ భాషపై పట్టు గురించి ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. అలాగే సింగిల్ టేక్‌లో సీన్ చేయగల సత్తా ఉన్న నటుడు. ప్రస్తుతం తారక్ కథానాయకుడిగా 'డ్రాగన్' చిత్రం తెరకెక్కుతోంది. ఆయన బర్త్ డే కానుకగా మే 20న ఈ సినిమా ఫస్ట్ గ్లింప్స్ విడుదలైంది. తారక్‌కు ఇండియానే కాకుండా జపాన్, యూఎస్‌ఏలో కూడా అభిమానులున్నారు. అయితే పాకిస్థాన్‌లో కూడా ఎన్టీఆర్‌కు అభిమానులున్నారు. అవును ఇది నిజం.. ఎన్టీఆర్ బర్త్‌డేను పాకిస్థాన్‌కు చెందిన ఓ కుటుంబం ఘనంగా సెలబ్రేట్ చేసింది. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. తారక్ పుట్టినరోజును సెలబ్రేట్ చేసిన వ్యక్తి పేరు సులేమాన్. ఆయన కుటుంబం అంతా ఈ నెల 20 ఒక చోట చేరి కేక్ కట్ చేసి సెలబ్రేట్ చేశారు. అంతే కాదు కేక్‌పై డ్రాగన్ టర్న్స్ 43 అని రాయించారు. ఇంట్లో వాళ్లంతా కలిసి హ్యాపీ బర్త్ డే అన్నా అని పాడుతూ విష్ చేస్తూ తారక్ పట్ల తమకున్న అభిమానాన్ని చాటుకున్నారు. దీనికి సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ అవుతోంది.





బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్ పేరు ప్రస్తుతం ఇండస్ట్రీని షేక్ చేస్తోంది. ధురంధర్ సినిమాతో మంచి విజయాన్ని అందుకున్న రణ్‌వీర్ చిక్కుల్లో పడిన విషయం తెల్సిందే. ఫరాన్ అక్తర్ దర్శకత్వం వహిస్తోన్న డాన్ 3 నుంచి చివరి నిమిషంలో తప్పుకోవడంతో బాలీవుడ్ లోని ఫిల్మ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్... రణ్‌వీర్ ని మూడేళ్లు బ్యాన్ చేసింది. 'డాన్ 3' వ్యవహారం తేలేవరకూ రణ్‌వీర్ సినిమాల్లో కనిపించడు. ఈ విషయమై ఇండస్ట్రీలో రచ్చ జరుగుతుంటే.. ఈ హీరో మాత్రం అమ్మవారి సేవలో మునిగిపోయాడు. అది కూడా చేసిన తప్పుకు ప్రాయశ్చిత్తం చేసుకోవడానికి వెళ్ళాడు అని చెప్పొచ్చు. అసలు విషయం ఏంటంటే.. గతేడాది గోవాలో జరిగిన ఇఫీ (అంతర్జాతీయ చలన చిత్రోత్సవం) ముగింపు వేడుకల్లో రణ్‌వీర్ సింగ్ కాంతార చిత్రంలోని పవిత్రమైన దైవ నృత్య ఘట్టాన్ని వేదికపై అనుకరించడమే కాకుండా, ఆ దైవాన్ని ఉద్దేశించి భూతం అని వ్యాఖ్యానించాడు. దీనిపై కన్నడిగుల సంస్కృతిని, మతపరమైన భావాలను గాయపరిచాడంటూ బెంగళూరుకు చెందిన ఒక న్యాయవాది ఫిర్యాదు చేయడంతో రణ్‌వీర్‌పై కేసు నమోదైంది. అనంతరం ఆయన ఇన్ స్టాగ్రామ్ వేదికగా రిషబ్ శెట్టి నటనపై ఉన్న గౌరవంతోనే అలా చేశానని, ఎవరి మనోభావాలనైనా దెబ్బతీసి ఉంటే క్షమించాలంటూ బహిరంగ ప్రకటన కూడా విడుదల చేశారు. ఇక రణ్‌వీర్ బహిరంగ క్షమాపణలు చెప్పడంతో కోర్టు ఆయనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేసింది. అంతేకాకుండా.. ఇలాంటి తప్పు ఇంకెప్పుడూ చేయకూడదని ఈ తప్పుకు ప్రాయశ్చిత్తంగా నాలుగు వారాల్లోగా చాముండి కొండలపై వెలిసిన చాముండేశ్వరి అమ్మవారిని దర్శించుకోవాలని ఆదేశించింది. దీంతో కర్ణాటక హైకోర్టు ఆదేశాల మేరకు రణ్‌వీర్ సింగ్ మంగళవారం మైసూరులోని చాముండేశ్వరి దేవి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించాడు. ఎటువంటి హంగూ ఆర్భాటాలు లేకుండా సాదాసీదా భక్తుడిలా ఆలయానికి వచ్చిన రణ్‌వీర్ సాధారణ భక్తులతో కలిసి క్యూలైన్ లో నిలబడి గర్భగుడిలోకి ప్రవేశించి అమ్మవారిని దర్శించుకున్నాడు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియా లో వైరల్‌గా మారాయి.




మ్యూజిక్ మిసైల్ దేవిశ్రీ ప్రసాద్ మనం ఎక్కడి నుంచి వచ్చామో.. ఆ రూట్స్‌ను ప్రతి క్షణం గుర్తుంచుకునే వ్యక్తి. తను పుట్టి, పెరిగిన గ్రామమన్నా, తన తండ్రి తిరిగిన ప్రాంతమన్నా ఆయనకు ఎంతో గౌరవం, ప్రేమ. తండ్రి మరణించి చాలాకాలమైనా.. ఇప్పటికీ ఆయన జ్ఞాపకాలను ఏదో ఒకరూపంలో నెమరు వేసుకుంటుంటారు. సొంతూరి జ్ఞాపకాల గురించి గుర్తు చేసుకుంటారు. తాజాగా తూర్పుగోదావరి జిల్లా రాయవరం మండలం వెదురుపాకలో దేవిశ్రీ ప్రసాద్ సందడి చేశారు. అక్కడ గ్రామ దేవత పోలేరమ్మ తల్లి జాతర ఉత్సాహంగా జరిగింది. గ్రామదేవతకు ప్రత్యేక పూజలు, సంప్రదాయ కార్యక్రమాలతో జాతర వైభవంగా నిర్వహించారు. ఈ జాతర వేడుకలో దేవిశ్రీ ప్రసాద్ పాల్గొన్నారు. తన తండ్రి సత్యమూర్తి స్వగ్రామం కావడంతో ప్రతి సంవత్సరం జాతర సమయంలో ఆయన కుటుంబ సభ్యులతో కలిసి స్వగ్రామానికి వచ్చి పూజల్లో పాల్గొంటుంటారు డీఎస్పీ. ఈ ఏడాది కూడా పోలేరమ్మ తల్లి జాతరకు హాజరైన దేవిశ్రీ ప్రసాద్.. గ్రామస్తులతో కలిసి జాతరను ఎంజాయ్ చేశారు. గరగ నృత్యంలో పాల్గొన్న ఆయన.. కళాకారులతో కలిసి ఉత్సాహంగా నృత్యం చేసి ఆకట్టుకున్నారు. అంతే కాదు తన స్వగ్రామం గురించి చెబుతూ ఓ వీడియో రిలీజ్ చేశారు. వెదురుపాక నా తండ్రి సత్యమూర్తి గారి పుట్టిన గ్రామం. చిన్నతనంలో ఇక్కడ ఏ కార్యక్రమం జరిగినా నాన్న మమ్మల్ని చెన్నై నుంచి మా సొంతూరుకి తీసుకొచ్చేవారు. ఇక్కడ ప్రకృతి ఎంత స్వచ్ఛంగా ఉంటుందో కళలు కూడా అంతే! ఇక్కడే ఓ అద్భుతమైన ఇల్లు కట్టుకున్నాం. మా ఊరు ఇక్కడ సంస్కృతి అందాలను, జానపద కళల గొప్పతనాన్ని, భక్తి మార్గాన్ని నేర్పించింది. వీటన్నిటి స్ఫూర్తితోనే నేను 'ఎల్లమ్మ' చిత్రాన్ని అంగీకరించాను. నా గుండెల నిండా కళల్ని నింపిన నా తండ్రికి కృతజ్ఞతలు' అని వీడియో ద్వారా తెలిపారు దేవిశ్రీ ప్రసాద్. ప్రస్తుతం దేవిశ్రీ ప్రసాద్ కథానాయకుడిగా ఎల్లమ్మ సినిమా చేస్తున్నారు. వేణు ఎల్దండి దర్శకుడు. దిల్ రాజు, శిరీశ్ నిర్మాతలు.




రామ్ చరణ్, జాన్వీ కపూర్ జంటగా బుచ్చిబాబు సాన దర్శకత్వంలో రానున్న చిత్రం 'పెద్ది'. వెంకట సతీష్ కిలారు నిర్మించిన ఈ సినిమా జూన్ 4న ప్రపంచ వ్యాప్తంగా విడుదలకు సిద్ధమైంది. ఓ పక్క ప్రచార కార్యక్రమాలు ముమ్మరంగా జరుగుతున్నాయి. దర్శకుడు బుచ్చి మాత్రం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలో బిజీగా ఉన్నారు. ఇందులో అప్పల సూరిగా నటించిన జగపతిబాబుతో డబ్బింగ్ చెప్పిస్తున్నారు. కథను మలుపుతిప్పే పాత్ర ఇదని ముందే హింట్ ఇచ్చారు మేకర్స్. జగ్గూభాయ్ చెబుతున్న డబ్బింగ్లో ఇంటెన్స్ చూస్తే అది నిజమే అనిపిస్తుంది. ఎంతో ఆర్ద్రతతో ఆయన డబ్బింగ్ చెబుతున్న వీడియో ఒకటి మేకర్స్ విడుదల చేశారు. ఎమోషనల్ సీన్‌లో ఆయన ఒదిగిపోయి డైలాగులు చెప్పడం ఆకట్టుకుంటోంది. మీరు ఈ వీడియోపై ఓ లుక్ వేయండి.




గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న మోస్ట్ అవేటెడ్ రస్టిక్ స్పోర్ట్స్ డ్రామా 'పెద్ది'. వృద్ధి సినిమాస్, మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రానికి ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. ఈ పీరియాడిక్ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాలో రామ్ చరణ్ సరసన జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తుండగా, కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్, జగపతి బాబు, దివ్యేందు శర్మ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి విడుదలైన పోస్టర్స్, గ్లింప్స్, టీజర్, సాంగ్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకోవడమే కాకుండా భారీ అంచనాలను రేకెత్తించాయి. వీటికి మించి ట్రైలర్ ఉంటుంది అనుకుంటే.. అది మిక్స్ టాక్ ను అందుకుంది. పెద్ది ట్రైలర్ బాగున్నా కూడా బుచ్చి కట్ చేసిన విధానం కన్ఫ్యూజ్ గా ఉందని పెదవి విరిచారు.




OWNED, PRINTED AND PUBLISHED BY KARNAM BHASKAR RAO, PRINTED AT SHREYA SREE PRINTERS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST., T.S. PUBLISHED AT SREEJA SREE PUBLICATONS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST, T.S, RNI NO: APTEL/2012/47246 EDITOR : KARNAM BHASKAR RAO, Ph: 08542-222814, Cell: 9848997085